సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
గురువారం, 18.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 147
పేజీలు: 12 వెల: రూ. 5




పాఠకులకు,
ప్రకటన కర్తలకు
శ్రేయోభిలాషులకు
పరాభవనామ
సంవత్సర ఉగాది
శుభాకాంక్షలు

-మేనేజ్‌మెంట్, ముద్ర

## సన్‌రైజర్స్‌కు కొత్త సారథి



డొమెస్టిక్ ఫామ్‌కు రివార్డ్..
ఇషాన్ కిషన్ ఎంపిక!
కమిన్స్ గాయంతో
సన్‌రైజర్స్‌లో మార్పు
వైస్ కెప్టెన్‌గా అభిషేక్ శర్మ
కావ్య మారన్ మాస్టర్ స్ట్రోక్..
11

## మూసీ ప్రాజెక్టు తొలి దశ డీపీఆర్

మంత్రి శ్రీధర్‌బాబు

మూసీ డీపీఆర్‌పై సభలో హీట్
1,435 నిర్మాణాలపై ప్రభావం
టీడీఆర్ హామీ ప్రకటించిన మంత్రి
మెయిన్‌హార్ట్‌పై కేటీఆర్ సందేహాలు
మంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం
09



## ప్రళయ కాల విమానం

అమెరికా డూమ్స్ డే రంగంలోకి!

- శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న అమెరికా 'ఫ్లయింగ్ కమాండ్ సెంటర్'!"
- యుద్ధ మేఘాల వేళ అగ్రరాజ్యం వ్యూహమేంటి?

10

*అణు యుద్ధం ముంచుకొస్తోందా? ఆకాశంలో అగ్రరాజ్యం 'ప్రళయ కాల' విమానం హల్చల్!" పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్న వేళ, అమెరికా తన అత్యంత రహస్య అస్త్రం 'E-6B మెర్క్యూరీ'ని రంగంలోకి దింపింది. భూమ్మీద సర్వం నాశనమైనా, గాలిలోనే ఉండి అణ్వాయుధాలను నియంత్రించగల ఈ 'డూమ్స్ డే' విమానాల కదలికలు ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. అసలు ఈ విమానాల వ్యూహమేంటి? అగ్రరాజ్యం ఏం ఆశిస్తోంది?* -ముద్ర డెస్క్




## విద్యుత్ కొరత రానివ్వం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



19 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌నూ తట్టుకుంటాం 03

## సీఎస్ పదవీ కాలం పొడిగింపు

సీఎస్ రామకృష్ణారావుకు 3 నెలల ఎక్స్‌టెన్షన్



- కేంద్ర డీవోపీటీ గ్రీన్ సిగ్నల్‌తో కొనసాగుతున్న పదవీ కాలం
- జూన్ నెలాఖరు వరకు సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్న రామకృష్ణారావు
- రాష్ట్ర విజ్ఞప్తికి స్పందించిన కేంద్రం.. పొడిగింపు ఉత్తర్వులు జారీ
- పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్న సీఎస్‌కు మరో అవకాశం

09

# అసెంబ్లీలో మూసీ రచ్చ

అసెంబ్లీ, మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య డైలాగ్ వార్
మొక్కజొన్న కంకులతో బీఆర్ఎస్ నిరసన.. సభ నుంచి వాకౌట్!
రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నిరసన

రెండో రోజూ అదే తీరు

గవర్నర్ ప్రసంగం ధన్యవాద తీర్మానంపై చర్చ

- అడ్డుకున్న మార్షల్స్.. ఉద్రిక్తత
- శాసనసభను కుదిపేసిన మూసీపై చర్చ
- మూసీ మురికిపాపం మీదేనంటూ కేటీఆర్, మంత్రి శ్రీధర్ బాబుల మధ్య వాగ్వాదం
- మండలిలో మహిళా సాధికారతపై పొన్నం ప్రసంగం
- రెండు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీ తీసుకొస్తామన్న మంత్రి పొంగులేటి
- మూడేళ్లలో ప్రతి పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని హామీ
- కేటీఆర్ పెయిడ్ ఆర్టిస్ట్‌లా వ్యవహరిస్తున్నారన్న ఎమ్మెల్యే నాయిని



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** శాసనసభ.. మండలి రెండో రోజూ అట్టుడికాయి. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మాణంపై బుధవారం జరిగిన రెండో రోజు చర్చ ఉభయ సభల్లో రచ్చలేపింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల తూటాలు పేలాయి. అధికార కాంగ్రెస్ పాలన తీరును బీఆర్ఎస్ ఎండగట్టే ప్రయత్నం చేసింది. ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలు, విమర్శలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రధానంగా రైతు సమస్యలు, మూసీ పునరుజ్జీవంపై ఇరు పార్టీల సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. శాసనసభ ప్రాంగణం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతుల సమస్యలపై నిరసన తెలిపేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ఉదయం వినూత్న రీతిలో మొక్కజొన్న కంకులతో అసెంబ్లీకి చేరుకున్నారు. అసెంబ్లీ గేటు వద్దే మార్షల్స్ వారిని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న రైతు భరోసాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చేతుల్లో మొక్కజొన్న కంకులు పట్టుకుని సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. సభ లోపలికి ఇటువంటి వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతి లేదని మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. నిరసన ప్రదర్శనలకు

మిగతా 02లో

## డ్రగ్స్ టెస్టుకు నేను రెడీ

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్

- అధికార పార్టీ నేతలూ ముందుకు రావాలి
- మూసీ పునరుజ్జీవంపై మంత్రుల కంటే అధికారులే ఉత్సాహం చూపుతున్నారు

03

## దేశ పారిశ్రామికాభివృద్ధికి భవ్య బాట

100 నగరాలు, 100 క్లస్టర్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్!



- పారిశ్రామిక విప్లవానికి మోదీ సర్కార్ శ్రీకారం
- మేక్ ఇన్ ఇండియాకు బూస్ట్.. రూ.33,660 కోట్ల భారీ ప్రణాళిక
- పత్తి రైతులకు ఊరట.. ఎంఎస్పీ ఖర్చులకు రూ.1,718 కోట్లు ఆమోదం
- ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుకు కేబినెట్ ఓకే
- యూపీలో 4-లేన్ హైవేకు రూ.6,969 కోట్లతో కేంద్రం అనుమతి
- మోదీ మంత్రివర్గ కీలక నిర్ణయాలు

10

*దేశ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. 'మేక్ ఇన్ ఇండియా'కు సరికొత్త ఊపిరి పోస్తూ రూ. 33,660 కోట్లతో 'భవ్య' (BHAVYA) పథకానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక క్లస్టర్లు, 100 స్మార్ట్ పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయడమే కాకుండా.. అటు పత్తి రైతులకు మద్దతు ధర రీయింబర్స్‌మెంట్, ఇటు ఎఫ్‌సీఆర్ఏ (FCRA) సవరణ బిల్లు వంటి కీలక అంశాలకు ఆమోద ముద్ర వేసింది. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు యువతకు భారీగా ఉపాధిని సృష్టించడమే లక్ష్యంగా కేంద్రం ఈ భారీ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది.*

-ముద్ర, డెస్క్

## రెయిన్ అలర్ట్..

## 3 రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



- కామారెడ్డి, సిద్దిపేట, జనగాంలో వడగండ్ల వాన హెచ్చరిక
- 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు.. ప్రజలకు అప్రమత్త సూచనలు
- ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు.. సాయంత్రం వేళల్లో తీవ్రత
- ఉష్ణోగ్రతలు తగ్గుదల.. ఎండల నుంచి ఉపశమనం

09

## 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్ చాట్

- జాతీయ స్థాయి పరిణామాలు, నియోజకవర్గాల పునర్విభజనతో ఆలస్యం
- డ్రగ్స్ ను ఉక్కుపాదంతో అణిచివేస్తాం
- దాని వెనక ఎవరున్నా ఉపేక్షించం
- మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ ఘటనను సీరియస్ గా తీసుకున్నాం
- అందుకే 9మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేశాం

09



## విజయవాడలో ఐజేయూ ప్లీనరీ

మార్చి 28-29న విజయవాడలో ఐజేయూ11వ జాతీయ సమావేశాలు

- చంద్రబాబు ముఖ్యఅతిథిగా జాతీయ జర్నలిస్టుల మహాసభలకు శ్రీకారం
- దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల ప్రతినిధులతో మీడియా సమస్యలపై చర్చలు
- మీడియా సమస్యలపై 25 రాష్ట్రాల ప్రతినిధుల చర్చలు
- 34 ఏళ్ల తర్వాత మళ్లీ విజయవాడలో ఐజేయూ ప్లీనరీకి ఆతిథ్యం

02

IJU
Indian Journalists Union



## సభకు రాని కేసీఆర్ గురించి చర్చ జరగాలి

సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

- ప్రజాధనాన్ని జీతభత్యాల రూపంలో తీసుకుని సభకు ఎందుకు రారు..?
- ఇప్పటి వరకు ఆయన రూ. 1.06 కోట్లకు పైగా జీతభత్యాలు తీసుకున్నారు
- విపక్షాల తీరు నాలుగు కోట్ల ప్రజలను నిరాశపర్చింది
- ప్రధాన ప్రతిపక్షంప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం

02


## ఆయిల్ ఫామ్ రైతులకు ఉగాది కానుక


మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



- నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ
- ఈ నెల 22న 70లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా

09



## మంగళస్నానం



### అభ్యంగ స్నానం

ఉగాది రోజున తెల్లవారుజామున నూనె రాసుకుని స్నానం చేయడం శుభప్రదంగా భావిస్తారు. ఇది శరీరానికి ఆరోగ్యాన్ని, మనసుకు ప్రశాంతతను ఇస్తుంది.

# అసెంబ్లీలో మూసీ రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఆవరణలో తావులేదని స్పష్టం చేశారు. మార్షల్స్ ప్రవర్తనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "రైతు పండించిన పంటను అసెంబ్లీ లోపలికి తీసుకెళ్తే తప్పేంటి? రైతు ప్రాతినిధ్యం వహించే ఈ సభలో రైతుల పంటకు అనుమతి లేదా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనీయకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని దుయ్యబట్టారు. రైతులంటే ప్రభుత్వానికి అంత చులకననా? అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. అన్నదాతల ఆవేదనను వినిపించేందుకు వస్తే మార్షల్స్‌ను అడ్డుపెట్టి నోరు నొక్కేయాలని చూస్తున్నారని విమర్శించారు. కాసేపు అసెంబ్లీ గేటు వద్దే బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పండించారన్నారు. 25 శాతం పంట దళారుల చేతికి వెళ్తోందని చెప్పారు. పంటల బీమాను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. మొక్కజొన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే చెల్లించాలని.. మద్దతు ధర రూ.2,400, బోనస్ రూ.500 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

### మూసీ పునరుజ్జీవంపై అట్టుడికిన సభ

మూసీ పునర్నిర్మాణ ప్రాజెక్టు డీపీఆర్ అంశంపై అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగింది. తొలి దశ డీపీఆర్ సిద్ధమైందని.. 1,435 నిర్మాణాలు ప్రభావితమవుతాయని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అయితే మెయిన్‌హార్ట్ సంస్థ సామర్థ్యంపై కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేస్తూ, గెజిట్ గణాంకాలకు మంత్రి మాటలకు పొంతన లేదని అన్నారు. దీంతో ప్రాజెక్టు పారదర్శకతపై సభలో వాదోపవాదాలు జరిగాయి. ప్రభుత్వం చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని, ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లను కూల్చే కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మూసీ డీపీఆర్, ప్రాజెక్టు వివరాలను వెల్లడిస్తున్న సమయంలో, బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, కీలకమైన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం దాటవేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేకపోవడంతో, ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా సభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి బయటకు వచ్చారు. సభ నుంచి వాకౌట్ తర్వాత బీఆర్ఎస్ నేతలు మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కేవలం రెండు నెలల్లోనే డీపీఆర్ ఎలా తయారవుతుందని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ గణాంకాలు చెబుతున్నారని ఆరోపించారు. 1,435 నిర్మాణాలు అని చెబుతున్నా, వాస్తవానికి వేలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలు మాట్లాడుతుంటే మైక్ కట్ చేస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా చర్చ జరగడం లేదని ధ్వజమెత్తారు, ఈ సందర్భంగా మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వం చెబుతున్నదొక్కటి చేస్తున్నది మరొకటని బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మూసీ డీపీఆర్ తయారు చేసేందుకే 18 నెలు పడుతుందని జనవరిలో మంత్రి చెప్పారని ఇప్పుడేమో డీపీఆర్ పూర్తయిందని అంటున్నారన్నారు. 18 నెలలు పడుతుందని చెప్పి రెండు నెలల్లోనే పూర్తి చేశారా అని నిలదీశారు. ఇవాళ మూసీ డీపీఆర్‌పై శాసననసభలో చర్చ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. ఒక వేళ డీపీఆర్ పూర్తయి ఉంటే సభ ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. డీపీఆర్ మాకు ఇంతవరకు అందలేదని ఏడీపీ బెబుతోందని, డీపీఆర్ తయారుకాకుండా తయారైందని చెప్పి సభను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. మూసీ డీపీఆర్ బాధ్యతలను మెయిన్ హార్ట్ సంస్థకు అప్పగించారు. కానీ ఈ సంస్థపై పాకిస్థాన్ ప్రభుత్వం రెడ్ కార్నర్ నోటీసులు పెట్టిందన్నారు.

### అందుకే సభ నుంచి వాకౌట్:

మూసీలో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి మేము తీవ్రంగా వ్యతిరేకం అని అందుకే ఈ రోజు సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్ని ఇళ్లు కూలగొడుతున్నారు అనేది కూడా ఈ ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదన్నారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీకీ డీపీఆర్ లేదని అంటున్నాడు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్ వద్దు, బాధితులతోనే ప్రజలతోనే పెట్టాలని మేము డిమాండ్ చేశాము. అందుకే ప్రభుత్వ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు మేము హాజరు కాలేదన్నారు. మూసీని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీనే అని ధ్వజమెత్తారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇచ్చారని 14,00 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి 10,000 ఇళ్లకు పైగా సంబంధించి నోటీసులు ఇచ్చారన్నారు. ఖమ్మం జిల్లాలో, సొంత జిల్లాలో ఇళ్లు కూలగొడితే ఉప ముఖ్యమంత్రికి కనీసం సమాచారం లేదని విమర్శించారు. ఏడీబీ లోన్ లేదన్నారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు, ప్రణాళిక లేదని ఆరోపించారు.

మరోవైపు కేటీఆర్ తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీరియస్ అయ్యారు. మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ సమర్థిస్తుందా? వ్యతిరేకిస్తుందా? అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో జీవిస్తున్నారని తెలిపారు. వారి జీవనస్థితిగతులు మార్చి, మూసీని హైదరాబాద్‌కు మణిహారంగా మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మూసీ ప్రక్షాళనతో ఇళ్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

### కేటీఆర్ క్యాన్సర్ లాంటి వాడు
#### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కేటీఆర్ లాంటి వ్యక్తులు సమాజానికి 'క్యాన్సర్' లాంటి వారు. వారిని అడ్డుకోకపోతే రాష్ట్రానికి ప్రమాదం. రేవంత్ రెడ్డి దయతోనే మీరు ఇంకా బయట తిరుగుతున్నారని గుర్తుంచుకోండి. కేటీఆర్ అసెంబ్లీ వేదికగా తన అహంకారంతో అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఈ నెల 17న అసెంబ్లీలో ఆయన ఒక పెయిడ్ ఆర్టిస్ట్‌లా మాట్లాడారు. యూట్యూబ్ ఛానెళ్లు పెట్టుకుని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కనీసం జాతీయ గీతం కూడా చూడకుండా పాడలేని వ్యక్తి కేటీఆర్. వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై మాకు అనుమానం ఉంది. వారికి డ్రగ్ టెస్టింగ్ చేయించాలి. అప్పుడే అసలు వాస్తవాలు బయటకు వస్తాయి. బీఆర్ఎస్ హయాంలో వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీగా భూకబ్జాలు జరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు కడదామంటే కనీసం స్థలం లేకుండా చేశారు. కార్పొరేటర్లను మర్డర్ చేయించిన చరిత్ర మీది.. అటువంటి మీరు గూండాయిజం గురించి మాట్లాడటం హాస్యాస్పదం.

### మహిళలను ఆరొందల బస్సులకు యజమానుల్ని చేశాం
#### శాసనమండలిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోంది. రాష్ట్రంలో రవాణా రంగాన్ని మహిళా సాధికారతతో ముడిపెట్టాం. సుమారు 600 బస్సులకు మహిళలనే యజమానులను చేశాం. ఈ వినూత్న పథకం ద్వారా మహిళలు కేవలం ప్రయాణికులే కాదు, వ్యాపారవేత్తలుగా మారుతున్నారు. బ్యాంక్ ఈఎంఐలు చెల్లించిన తర్వాత కూడా ఒక్కో మహిళా యజమానికి నెలకు రూ.70 వేల నికర ఆదాయం మిగులుతోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. దీనికి తోడు ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బస్ స్టేషన్లలో రూ.100 కోట్లతో మౌలిక వసతులు కల్పించాం. ప్రజా రవాణాను మరింత చేరువ చేసేందుకు ఏటూరునాగారం, పెద్దపల్లి జిల్లాల్లో కొత్తగా బస్ డిపోలను ఏర్పాటు చేశాం. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. విధి నిర్వహణలో ఉండి కార్మికులు మరణిస్తే, వారి కుటుంబాలకు రూ.కోటి భీమా అందేలా ప్రత్యేక ఒప్పందం చేసుకున్నాం. ఇది కార్మికుల కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుంది.









### రెండు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీ
#### శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రాబోతున్నాం. ఇప్పటికే ఈ పాలసీ ఓ రూపానికి తీసుకువచ్చాం. త్వరలోనే ఫైనల్ చేస్తాం. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. కోర్టుల్లో ఆటంకాలు లేకుండా ఇళ్ల స్థలాల పంపిణీకి యోచిస్తున్నాం. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై ఇటీవల మహిళా దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారు. అతి కొద్దిరోజుల్లోనే ఆ తీపికబురు వినిపిస్తాం. జర్నలిస్టుల ఉద్యోగాల భద్రతా విషయంలో ఈ ప్రభుత్వం వెనకడుగు వేయబోదు. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులను వేరు చేసే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. నిజమైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నదే మా లక్ష్యం. అక్రిడిటేషన్ల విషయంలో ప్రభుత్వం తొలుత 252 జీవోను ఇచ్చింది. అయితే జర్నలిస్టు సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలతో ఆ జీవోను సవరించి ఇచ్చాం. అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయములో కొంత మంది లేనిపోని అపోహలను సృష్టిస్తున్నారు. అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ఓ కమిటీని ఏర్పాటు చేశాం. ఇంకా ఏవైనా సవరణలు చేయాల్సిన అవసరం ఉంటే సర్క్యులర్ జారీ చేయడానికి కూడా ఈ ప్రభుత్వం భేషజాలకు వెళ్లబోదు.

ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేశాం. మిగిలిన మూడు విడతలను కూడా దశలవారీగా పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని మారుమూల గిరిజన తండాలు, గూడాల్లో గతంలో ప్రారంభమై వివిధ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుంది. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు ఫ్లెక్సిబిలిటీ ఇచ్చి, లబ్ధిదారులకు అనుకూలంగా మార్పులు చేపడతాం. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి వివక్ష ఉండదు. కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలకే ప్రాధాన్యం ఇస్తాన్నాం. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నాటికి సుమారు లక్ష ఇళ్లు పూర్తి కానున్నాయి. జూన్–జులై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో మెజారిటీ పూర్తి అవుతాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రస్తుతం వాళ్ళు నివసిస్తున్న ప్రాంతానికి వీలైంత దగ్గరలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టడానికి కార్యాచరణ రుపొందిస్తున్నాం. గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులు ఉపయోగించలేకపోయిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. అదేవిధంగా, రెండు పడక గదుల ఇళ్ల పథకంలో పెండింగ్ బిల్లుల్లో 99 శాతం ఇప్పటికే చెల్లించాం, మిగిలినవాటిని కూడా త్వరలో క్లియర్ చేస్తాం. వివిధ దశల్లో ఆగిపోయిన రెండు పడక గదుల ఇళ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేయడానికి ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.

హిందువులు కుటుంబ నియంత్రణ పాటించవద్దు. : బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

హిందువులు కుటుంబ నియంత్రణ పాటించవద్దు. దేశంలో ముస్లిం జనాభా పెరుగుతోంది. వారిని తట్టుకోవాలంటే హిందూ జనాభా పెరగాలి. గతంలో ఒక్కో ఫ్యామిలీ 23 మంది వరకు సంతానం కలిగి ఉండేది. తెలంగాణలో రాబోయేది హిందూ ప్రభుత్వమే. 2 జూన్ 2029న నేను రాష్ట్ర హోమ్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న.రాష్ట్రంలో కాంగ్రెస్ ఇదే చివరి ప్రభుత్వం అని కాంగ్రెస్‌కు చివరి ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మా ప్రభుత్వంలో సీఎం ఎవరనేది నేను మాట్లాడను. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌ను ముస్లింలు ఆక్రమించుకోబోతున్నారు. వారి ఆగడాలను ప్రశ్నించేవారు కరువయ్యారన్నారు.

### సీపీకి సెలవు ఐజీ ఎలా ఇస్తారు?
#### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

మీడియా నేను చెప్పింది చెప్పినట్టు వక్రీకరించకుండా రాస్తే కరీంనగర్ యువతకు లాభం అవుతుంది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఫైరింగ్ పై మంత్రి శ్రీధర్ బాబు విచారణ చేయిస్తామన్నారు. నేను ఆరోపణలు చేసిన తర్వాత సిపి తను ఆరోజు సెలవులో ఉన్నానని ప్రెస్ కు ఒక లెటర్ రిలీజ్ చేశారు. లెటర్ మొత్తం ప్రింట్ చేసి, సిపి 19వ తేదీ ఎందుకు పెన్నుతో రాశారు? దానికి సమాధానం చెప్పాలి. రాజ్యాంగాన్ని, భద్రతను కాపాడాల్సిన పోలీసులు ఇలా చేస్తే ఎలా? సిపికి సెలవు ఇచ్చేది డీజీపీ. కానీ ఇక్కడ సీపీకి సెలవు ఐజీ ఎలా ఇస్తారు? ఫైరింగ్ జరిగిన ప్రదేశంలో ప్యాచ్ వర్క్ కూడా చేశారు. ఇది నిజం కదా? కేసులు మా మీద పెట్టడం కాదు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోండి. కరీంనగర్ సిపిపై 30వ తేదీ వరకూ చర్యలు తీసుకుపోతే మరిన్ని విషయాలు బయటికి వస్తాయి. దొంగ ఆఫీసర్ల మీద చర్యలు తీసుకోవాలి. నాకు పోలీసు వ్యవస్థపై గౌరవం ఉంది. హుజూరాబాద్ ఏసీపీ, జమ్మికుంట రూరల్ సీఐపై కూడా చర్యలు తీసుకోవాలి. నేను తప్పు మాట్లాడితే, అబద్ధమైతే అసెంబ్లీ ముందు ముక్కు నెలకు రాస్తాను. ఒక్క సిపితో పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వస్తుంది.

# విజయవాడలో ఐజేయూ 11వ జాతీయ ప్లీనరీ

**మార్చి 28-29న విజయవాడలో ఐజేయూ సమావేశాలు**

**చంద్రబాబు ముఖ్యఅతిథిగా జాతీయ జర్నలిస్టుల మహాసభలకు శ్రీకారం**

**మీడియా సమస్యలపై 25 రాష్ట్రాల ప్రతినిధుల చర్చలు**

**జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై కీలక తీర్మానాలు ఆమోదం దిశగా**

**34 ఏళ్ల తర్వాత మళ్లీ విజయవాడలో ఐజేయూ ప్లీనరీకి ఆతిథ్యం**



**ముద్ర, హైదరాబాద్:** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11 వ ప్లీనరీ ( మహాసభలు) మార్చి 28, 29 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ ( అమరావతి ) లో జరగనున్నట్లు ఐజేయూ అధ్యక్షులు కే.శ్రీనివాస రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ , జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్లీనరీ సమావేశాలను ప్రారంభిస్తారని, పలువురు కేంద్రమంత్రులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు అతిథు లుగా హాజరై సందేశాలు ఇస్తారని వారు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఐజేయూ రెండవ ప్లీనరీ సమావేశాలు 1992 లో విజయవాడలో జరిగాయనీ, తిరిగి 34 ఏళ్ల తర్వాత 11వ ప్లీనరీకి ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆతిథ్యం ఇస్తోందని ఆ ప్రకటనలో వివరించారు. ఈ సమావేశాలకు దేశంలోని 25 రాష్ట్రాల నుండి ఎన్నికైన ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల ఐజేయూ అనుబంధ యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు , హాజరౌతారని తెలిపారు. ఈ సమావేశాల్లో దేశంలో నేడు మీడియా రంగంలో నెలకొన్న స్థితిగతులు, వృత్తిపరమైన సమస్యలు, ఇటీవల మీడియా స్వేచ్ఛకు ఎదురవుతున్న ప్రమాదాలు, సంస్థాగత విషయాలు, వంటింశాలపై చర్చలు జరుగుతాయని వారు ఆ ప్రకటనలో వివరించారు.

మీడియా సంబంధిత అంశాలపై పది తీర్మానాలను ఆమోదించడంతోపాటు, వర్కింగ్ జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ చర్యల సాధన కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణను సమావేశాలు ఖరారు చేస్తాయని ఆ ప్రకటనలో తెలిపారు. రానున్న రెండేళ్ల పదవీ కాలానికి నూతన జాతీయ కార్యవర్గ ఎన్నికలు కూడా ప్లీనరీలో జరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చీఫ్ పాట్రన్ గా సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షునిగా, ఎ.పి.యు.డబ్ల్యూ.జే. అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా ఏర్పాటైన ఆహ్వానసంఘం ప్లీనరీని విజయవంతం చేయడానికి చురుగ్గా కృషి చేస్తున్నదని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో వివరించారు.

### సభకు రాని కేసీఆర్ గురించి
# చర్చ జరగాలి

ప్రజాధనాన్ని జీతభత్యాల రూపంలో తీసుకుని సభకు ఎందుకు రారు..?

**ఇప్పటి వరకు ఆయన రూ. 1.06 కోట్లకు పైగా జీతభత్యాలు తీసుకున్నారు**

**విపక్షాల తీరు నాలుగు కోట్ల ప్రజలను నిరాశపర్చింది**

**ప్రధాన ప్రతిపక్షంప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది**

**అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం**

**ఆయన తన ప్రసంగంలో ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబించారు**

**కేసీఆర్, బీఆర్ఎస్ పై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ గురించి సభలో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన తీరు రాజ్యాలు పోయినా రాచరిక పోకడలు పోలేని చందంగా ఉందని విమర్శించారు.. ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారని కేసీఆర్ కు చురకలంటించారు. విపక్షాల తీరు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నిరాశపరిచేలా ఉందన్నారు. సభలో గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్షం హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించినట్లు సీఎం వివరించారు. కానీ ఆ పార్టీ సభ్యులు మళ్లీ తమ అహంకారాన్ని ప్రదర్శించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం రాత్రి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేత హోదాలో కొనసాగుతోన్న కేసీఆర్... ఇప్పటివరకు రూ. 1.06 కోట్లకు పైగా జీతభత్యాలు పొందారన్నారు. అయినా ఇతం వరకు సభకు మాత్రం రాలేదన్నారు. కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలన్న సీఎం.. విధులకు హాజరుకాకుండా ప్రజాధనాన్ని జీతభత్యాల రూపంలో తీసుకునే వారిపై సభలో చర్చ జరగాల్సిందేనన్నారు. అలాంటి వారిపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని సీఎం వ్యాఖ్యానించారు. విపక్ష నేత కేసీఆర్ తీరు రాష్ట్రానికి మాయని మచ్చ అని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షం నియంతృత్వ ధోరణితో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. గవర్నర్‌కు శుభాకాంక్షలు చెప్పడానికి కూడా ప్రతిపక్ష నాయకుడు రాకపోవడం సభా సాంప్రదాయాలను అగౌరవపర్చుమేనన్నారు. ఇది రాష్ట్రానికి మాయని మచ్చ అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను తప్పుదోవ పట్టించడమే విపక్ష సభ్యులు తమ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. భవిష్యత్ లో ఏఐ సునామీ రాబోతుందని సీఎం జోస్యం చెప్పారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ తన ప్రసంగంలో వివరించారని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను కనీసం చదివారా? చూశారా అని ప్రశ్నించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించకపోతే తర్వాత తరాలు మనల్ని క్షమించవని సీఎం చెప్పారు. ఇది నవశకానికి నాంది పలుకాల్సిన సమయమని చెప్పారు. అధికారం కోల్పోయామన్న దుఃఖమే తప్ప ప్రభుత్వానికి సహకరించాలన్న ఆలోచన ప్రధాన ప్రతిపక్షానికి లేదని విమర్శించారు. ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించుకున్నట్లు వివరించారు. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ గా విభజించుకుని అభివృద్ధికి బాటలు వేస్తున్నామని చెప్పారు.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ఇంటిని శుభ్రపరచడం

ఉగాది ముందు రోజు ఇంటిని పూర్తిగా శుభ్రం చేయాలి. ఇది కొత్త సంవత్సరాన్ని శుభ్రతతో ఆహ్వానిస్తున్నట్లు సూచిస్తుంది.





# విద్యుత్ కొరత రానివ్వం

- 19 వేల మె.వా విద్యుత్ డిమాండ్‌నూ తట్టుకుంటాం
- వేసవికాలం, యాసంగి సాగు సీజన్ నేపథ్యంలో అధికారులతో
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మెగావాట్ల విద్యుత్ ను సరఫరా చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. యాసంగి పంటల సీజన్‌తో పాటు వేసవి ప్రభావం కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, వినియోగం గణనీయంగా పెరుగుతుందన్న ఆయన డిమాండ్ ను సమర్థంగా తట్టుకునే తమ నెట్‌వర్క్ సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. వేసవికాలం, యాసంగి సాగు సీజన్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. గతేడాది మార్చి 20న నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు అన్నారు. ఈ సంవత్సరం మార్చి 2న 17,606 మెగావాట్ల డిమాండ్‌ను చేరుకుని గత రికార్డును సమం చేసిందని చెప్పారు. అనంతరం రోజురోజుకీ పెరుగుతున్న డిమాండ్, మార్చి 13న 18,228 మెగావాట్లకు చేరి, 341.08 మిలియన్ యూనిట్ల వినియోగంతో కొత్త రికార్డును సృష్టించిందనీ వివరించారు. డిమాండ్ భారీగా పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, ఓవర్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సంస్థలు సమర్థంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ఈ కృషికి విద్యుత్ సిబ్బందిని అభినందించారు. అలాగే విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. యాసంగి పంటల సీజన్, వేసవి కాలం ముగిసేంతవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రైతాంగానికి, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, తెలంగాణ డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్ ఫరూఖీ, జితేష్ వి. పాటిల్, వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

# తండ్రి మరణం... కన్నీటితో పది పరీక్ష రాసిన కొడుకు

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**

జోగులాంబ గద్వాల జిల్లాలో హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. కేటిదొడ్డి మండలం విశ్వబ్రాహ్మణ మండలాధ్యక్షులు, గంగన్ పల్లి గ్రామానికి చెందిన సదానందం అచారి (44) మంగళవారం సాయంత్రం గద్వాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ దుఃఖాన్ని దిగమింగుకొని పాతపాలెం జడ్పీహెచ్ఎస్ లో పదో తరగతి చదువుతున్న సాయి విష్ణు తండ్రి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుమారుడు తన లక్ష్యాన్ని వీడకుండా బుధవారం నిర్వహించిన పదో తరగతి వార్షిక హిందీ పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ



కలచివేస్తోంది. తండ్రి మరణించిన పుట్టెడు దుఃఖంలో కూడా, తన భవిష్యత్తు కోసం కన్నీళ్లతో పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆ విద్యార్థి.. తన సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎంఈఓ విజయభాస్కర్, ఉపాధ్యాయులు, స్థానికులు తెలిపారు.



# భర్త హత్య చేశాడు..

- యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో కీలక పరిణామం

**ముద్ర న్యూస్ :**

అదనపు కట్నం కోసమే యూట్యూబర్ వైష్ణవిని ఆమె భర్త హత్య చేసినట్లు జగిత్యాల మెట్ పల్లి డీఎస్పీ రాములు తెలిపారు. కోరుట్లలోని సీఐ కార్యాల యంలో కేసు వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన గంధం వైష్ణవిని చిత్తరి హరిబాబు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి హరిబాబు కుటుంబస భ్యులు ఒప్పుకోకపోవడంతో అత్తగారింట్లో కాపురం పెట్టాడు. కొంత కాలం తరువాత రూ.5లక్షలు కట్నం కావాలని కోరగా మాదాపూర్ గ్రామంలో 2గుంటల భూమిని కొనుగోలు చేసి ఇచ్చారు. మరో రూ. 5లక్షలు అదనపు కట్నం కావాలని వైష్ణవిని వేధించేవాడు. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున కత్తితో దాడి చేసి వైష్ణవిని హత్య చేసినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి గంధం దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. హత్య కేసుతో సంబంధం ఉన్న మిగితా నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# వరదల నివారణకు నోడల్ ఏజెన్సీ

- ఉధృతిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికలు
- ఆధునిక పరిజ్ఞానంతో పకడ్బందీగా చర్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




వర్షాకాలంలో సంభవించే వరదల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకనుగుణంగా వరదల నివారణకు "నోడల్ ఏజెన్సీ" ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం జూబ్లిహిల్స్ లోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థలో కేంద్ర జలవనరుల సంఘం,కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ ల ఆధ్వర్యంలో జరిగిన వరద మైదానాల జోనింగ్‌పై జరిగిన ప్రాంతీయ స్థాయి శిక్షణా శిబిరంలో మంత్రి మాట్లాడారు. వరదలతో సంభవిస్తున్న విపత్తులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో ముందస్తు చర్యలకు ఉపక్రమించిందని వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు మానవ తప్పిదాలతో తరచుగా వరద విపత్తులు సంభవిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2024 సెప్టెంబర్ లో సంభవించిన వరదల ఉధృతికి రాష్ట్రంలో భారీ నష్టం సంభవించిందన్నారు. కిందటేడాది మున్నేరు ఉప్పొంగడంతో ఖమ్మం పట్టణంలోనీ పలు కాలనీలు అతలాకుతలం అయిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో పాటు పెద్ద ఎత్తున పంటపొలాలు నేలమట్టమై పశుపక్షాదులు విగత జీవులుగా మారిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. మున్నేరు నది ఉప్పొంగి 36 అడుగుల ఎత్తుకు నీరు చేరడంటి ఖమ్మం పట్టణం అతలాకుతలం అయిన విషయాన్ని ప్రస్తావించారు. అక్కడి కుటుంబాలు వారసత్వంగా నిర్మించుకున్న ఇండ్లు పై కప్పుల వరకు మునిగిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విపత్తుకు 110 కి పై చిలుక గ్రామాలు ముంపుకు గురి కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు రక్షణార్థం కొండలు,గుట్టలు,ఇంటి పై కప్పుల మీదకు చేరి పడవల కోసం నిరీక్షించిన ఉదంతం తనను ఎంతో కలచి వేసిందన్నారు. ఆ వరదల విపత్తుకు 29 మంది మృత్యువాత పడ్డారని,5,438 కోట్ల నష్టం వాటిల్లడదతో పాటు 20 లక్షల ఎకరాల్లో పంట నీటిమట్టం పాలు అయిందని ఆయన గణాంకాలతో వివరించారు. దీనికి తోడు 1023 కిలోమీటర్ల దూరంలో రహదారులు 257 వాగులు ,చెరువులు దెబ్బతిన్నాయన్నారు.ఖమ్మం జిల్లాలో 30 ఏండ్లుగా ఇలాంటి విపత్తు చూడలేదన్నారు. వర్షాకాలంలో భద్రాచలం సమీపంలోని గోదావరి నది ప్రమాదస్థాయి నిమించి వరద ఉధృతి రావడంతో భద్రాచలంనెల్లిపాక రహదారి తెగిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ వరదల ప్రభావం 29 జిల్లాల పై పడిందన్నారు. చెరువులు,కుంటలు పొంగి పొర్లడంతో పాటు కట్టలు తెగి పడడంతో పంటలతో పాటు వేలాది కిలోమీటర్లు దూరం రహదారులు ఘోరంగా దెబ్బతిన్నాయన్నారు. ఇవి గణాంకాల కోసం చెప్పడం లేదని నష్టం వెనుక రాష్ట్రంలోని ప్రజల మనోవ్యధకు అద్దం పడుతోందని ఆయన తెలిపారు. భారీ వర్షాలు,తుఫాన్ లతో వచ్చే విపత్తుల కంటే కాలువల ఆక్రమణలతో ఈ తరహా విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. సహజసిద్ధంగా ప్రవహించే కాలువల ప్రవాహాన్ని ఆక్రమణల ద్వారా అడ్డుకోవడంతోటే తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని ఆయన చెప్పారు. తల్లి లాంటి నదుల పరిరక్షణకు సంఘటితంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వరదల సమయంలో విపత్తులు పునరావృతం కాకుండా నిపుణులు తమ తమ నైపుణ్యాలను ప్రదర్శించాలని ఆయన సూచించారు. ఈ తరహా విపత్తుల నివారణకు శాస్త్రవేత్తలు ఏ.ఐ,జి. ఐ. ఎస్ ల వంటి ఆధునిక పరిజ్ఞానంతో సురక్షిత మార్గాలు అన్వేషించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కేంద్ర జలసంఘం ప్రతినిధి మాధురీయా, పాటు కే. ఆర్.యం.బి చైర్మన్ బి.పి పాండే, జి. ఆర్. యం.బి చైర్మన్ బిస్వాస్,పోలవరం ప్రాజెక్ట్ మెంబర్ సెక్రటరీ యం.రఘురాం,లతో పాటు ప్రకృతి విపత్తుల నిర్వహానాధికారులు ఐ. ఐ. టి ,ఎన్.ఐ. టి లతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.


# డ్రగ్స్ టెస్టుకు నేను రెడీ

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్
- అధికార పార్టీ నేతలూ ముందుకు రావాలి
- మూసీ పునరుజ్జీవంపై మంత్రుల కంటే అధికారులే ఉత్సాహం చూపుతున్నారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్ట్ లకు ముందుకురావాలంటూ శాసనసభ వేదికగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేసిన వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. డ్రగ్ టెస్టులకు తాను సిద్ధమని చెప్పానన్నారు. కానీ తర్వాత ఈ విషయంపై అధికార పార్టీ నేతలెవరూ ఏమీ మాట్లాడడం లేదన్నారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ డీపీఆర్ విషయంలో మొత్తం ప్లేట్ మార్చారన్నారు. మంత్రుల కంటే అధికారులు ఎక్కువ మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆరు నూరైనా మూసీ ప్రాజెక్టు చేపడతామని అధికారి ఎలా చెబుతారు? అని ప్రశ్నించారు. మూసీ డీపీఆర్ ఉంటే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఆ డీపీఆర్ ప్రవేశపెట్టకపోతే శ్రీధర్ బాబుపై సభా హక్కుల ఉల్లంఘన కింద ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం నడుపుతున్న పెద్దలు మూర్ఖంగా వ్యవహరిస్తున్నారన్న కేటీఆర్.. ప్రణాళిక, డబ్బు లేకుండానే ఇండ్లు కూల్చేస్తున్నారని విమర్శించారు. రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు ఉత్తర్వు చూపిస్తే తాను రాజీనామా చేస్తానని చెప్పానని కేటీఆర్ అన్నారు. అందుకు నేను రాజీనామా చేయాలని సీతక్క అంటున్నారన్న ఆయన ఆమె మాటల్లో అర్థం లేదన్నారు. సభను తప్పుదోవ పట్టించిన భట్టి రాజీనామా చేయాలా లేక నేను చేయాలా అని ప్రశ్నించారు. ఉత్తర్వులు చూపిస్తే రాజీనామాకు సిద్ధమన్న మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. మూసీ, హ్యామ్ రోడ్లలో అవినీతిపై మా ప్రభుత్వం వచ్చాక విచారణ చేపడతామన్నారు. పార్టీ మారి.. ఆ పార్టీ తరఫున పోటీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిషేధిత భూములపై మంత్రి పొంగులేటి ఎందుకు నోరు మెదపట్లేదని నిలదీశారు. కోటి ఎకరాలు నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని వివరించారు. అలాగే మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కాంగ్రెస్‌లో అసంతృప్తి ఉన్నట్లుందని కేటీఆర్ చెప్పారు. ఆయన విషయంలో తాము జీవన్ రెడ్డితో ఎలాంటి చర్చలు చేయలేదన్నారు.



# వడగళ్ల వాన..

## దెబ్బతిన్న పంటలు

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**

ద్రోణి ప్రభావంతో జోగులాంబ గద్వాల జిల్లాలో మంగళ వారం రాత్రి కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, తేలికపాటి వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. మంగళ వారం రాత్రి జిల్లాలోని పలు మండలాలో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. మామిడి తోటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షంతో కొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. గట్టు మండలంలో వడగండ్లు కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చేతికొచ్చిన మొక్కజొన్న, వరి, మామిడి పంటలకు కూడా కొంత నష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి దుమారం కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. చేతికి వచ్చిన వరి, మామిడి, మిర్చి తోటలు ఈదురుగాలలు ధాటికి దెబ్బతిన్నాయి. ఇప్పటికే పలు కొనుగోలు కేంద్రాల్లో పోసిన మొక్క జొన్న ఈ వర్షానికి తడిసిముద్దయింది. ముందస్తు హెచ్చరిక లేకపోవడంతో ఇటుక బట్టీ వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. కాల్చడానికి సిద్ధంగా ఉన్న ఇటుక రాళ్లు వర్షానికి పనికిరాకుండా పోయాయని, ఒక్క రాత్రిలోనే లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

# అబ్దుల్లాపూర్‌మెట్‌లో దారుణం

- అక్కను చంపి.. ముక్కలుగా నరికేసిన తమ్ముడు

**ముద్ర న్యూస్ :**



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో దారుణం చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో ఆమెను తమ్ముడు హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు. కొన్నాళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును తమ్ముడు పప్పు రామ్ గమనించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా.. వినిపించుకోకపోవడంతో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పూర్ చెరువులో పడేశాడు. గత నెల 28న ఆమె బాటసింగారంలోని కిరాణ దుకాణానికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో తమ్ముడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య వ్యవహారం బయటపడింది.

# ఆయుర్వేదానికి పూర్వ వైభవం

- డాక్టర్ పి మాధవన్ కుట్టి వారియర్

**ముద్ర, హైదరాబాద్:**




ఎంతో ప్రాచీనమైన ఆయుర్వేద వైద్యానికి మళ్లీ పునర్ వైభవం వస్తున్నదని కోటక్కల్ ఆర్యవైద్యశాల మేనేజింగ్ ట్రస్టీ వైద్యరత్నం పిఎస్ వారియర్ ముని మనవడు డాక్టర్ పి మాధవన్ కుట్టి వారియర్ అన్నారు. నగరం లో కోటక్కల్ ఆర్య వైద్యశాల ప్రారంభించనున్న నేపథ్యం లో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఆయుర్వేదం పేరుతో సమాజంలో ఎంతోమంది రకరకాల ప్రాక్టీసులు చేస్తున్నారని కానీ ఆయుర్వేదానికి కోటక్కల్ ఆర్యవైద్యశాలకు 120 సంవత్సరాల చరిత్ర ఉందని ఆయన అన్నారు. నేటి యువతకు అనేక సమస్యలకు ఆయుర్వేదం ద్వారా పరిష్కారాలు అందించేందుకు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 లో త్రినయ పేరుతో ఆర్య వైద్యశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సంప్రదాయ పద్ధతిలో అర్బన్ ప్రాంతాలలో నివసిస్తున్న వారికి కూడా కొటక్కల్ ఆర్యవైద్యశాల సేవలు అందించే దిశగా మరిన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈ ఆస్పత్రిని ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మాధవన్ మాట్లాడుతూ వైద్యం పుట్టింది ఆయుర్వేదం నుంచి అని అలాంటిది సమాజంలో జరిగిన ఎన్నో మార్పుల వల్ల చాలామందికి ఆయుర్వేదం దూరమైందని కానీ మారుతున్న పరిస్థితుల వల్ల మళ్లీ ఆయుర్వేదం వైపు అందరూ చూస్తున్నారని దీనికి ఆయుర్వేదం వల్ల వస్తున్న మంచి ఫలితాలే కారణమని ఆయన అన్నారు. దేశం లో ప్రతి ఏటా 70 లక్షల మంది ఆయుర్వేద వైద్యం పొందుతున్నారని అన్నారు. ఈ సమావేశం లో కోటక్కల్ ఆర్య వైద్యశాల సీఈవో హరి కుమార్, జోగేష్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
19.03.2026 గురువారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# 2026-27 శ్రీ పరాభవ నామ సంవత్సర రాశి ఫలాలు

తెలుగు ప్రజలు కొత్త సంవత్సరంగా భావించే ఉగాది పండుగ మార్చి 19న గురువారం జరుపుకొనున్నారు. ఈ పండుగతో శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. ఉగాది అంటే యుగానికి ఆది.. అంటే తెలుగు క్యాలెండర్ ప్రకారం ఇప్పడే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుందని భావిస్తారు. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగ నిర్వహిస్తారు. ఈరోజు నుంచే సృష్టి ఆరంభమైందని పురాణాలు చెప్పబడుతున్నాయి. అయితే ఉగాది సందర్భంగా కొత్త పంచాంగం కూడా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఈ ఏడాదిలో 12 రాశుల ఫలితాలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం..



## మేష రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..11 | వ్యయం.. 05 |
| రాజ పూజ్యం ..02, | అవమానం ..04 |

ఈ రాశి వారికి గురు గ్రహ బలం అధికంగా ఉండడంతో వీరు అనుకున్న ఫలితాలను పొందుతారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందే అవకాశం ఉంటుంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలలో సంతాన ప్రయత్నాలు పలిస్తాయి. ఈ రాశి విద్యార్థులకు ఈ సంవత్సరం అనుకూలమైన ఫలితాలు ఉంటాయి. అయితే కుటుంబ వాతావరణం లో కొన్ని ఒడిదుడుకులు ఉండవచ్చు. ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆసుపత్రుల ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులను గౌరవించడం వల్ల సరైన పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

## వృషభ రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..05 | వ్యయం.. 14 |
| రాజ పూజ్యం ..05, | అవమానం ..04 |

ఈ ఏడాదిలో ఈ రాశి వారు ఏదైనా పనిని ప్రారంభిస్తే దానిని వెంటనే పూర్తి చేస్తారు. ఉద్యోగులకు కార్యాలయంలో అనుకూలమైన వాతావరణం పొందడంతో ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులు వ్యాపారులకు మద్దతుగా ఉంటారు. విజయాలు పొందడంతో సంతోషంగా ఉండగలుగుతారు. స్థిరాస్తులకు సంబంధించి, వాహనాలకు సంబంధించిన శుభవార్తలు వింటారు. విద్యార్థులు అనుకున్న విజయాలను పొందుతారు. ఇంట్లో సామరస్యంగా వాతావరణం ఉంటుంది. అయితే ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. అయితే మెడలో వెండి గొలుసు ధరించడం వల్ల సానుకూల ఫలితాలు ఉంటాయి.

## మిథున రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..08 | వ్యయం.. 11 |
| రాజ పూజ్యం ..01, | అవమానం ..07 |

మిథున రాశి వారికి ఈ సంవత్సరం ఆదాయం పెరుగుతుంది. గతంలో చేపట్టిన కొన్ని ప్రయత్నాలు ఇప్పుడు సక్సెస్ అవుతాయి. విద్యార్థులు పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తారు. మీరు అనుకున్న ఫలితాలను పొందుతారు. నిరుద్యోగులకు కొత్త అవకాశాలు వస్తాయి. వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అదనపు ఆదాయం చేరడానికి మార్గం ఏర్పడుతుంది. కుటుంబా వాతావరణం సామరస్యంగా ఉంటుంది. చిన్నచిన్న విభేదాలు వచ్చినా కూడా వెంటనే పరిష్కారం అవుతుంది. ఆరోగ్య విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి. అంధులకు ఆహారం సహాయం చేయడం వల్ల సానుకూల ఫలితాలు ఉంటాయి.

## మకర రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..02 | వ్యయం.. 08 |
| రాజ పూజ్యం ..01, | అవమానం ..02 |

మీ రాశి వారికి ఏడాది అనుకూలమైన ఫలితాలు ఉంటాయి. వివాహం చేసుకున్న వారి జీవితం సంతోషంగా గడుస్తుంది. కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారు. విదేశాలకు వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు పలిస్తాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉంటారు. వ్యాపారులు కొత్తగా పెట్టుబడులు పెడతారు. అదృష్టం కొద్దీ ఆదాయం పెరుగుతుంది. అయితే ఉద్యోగులు సవాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తేనే ఆదరణ ఉండే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు ఉండే అవకాశం ఉంది. వైవాహిక జీవితం లో కొన్ని విషయాల్లో మౌనంగా ఉండాలి.

## కర్కాటక రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..02 | వ్యయం.. 11 |
| రాజ పూజ్యం ..04, | అవమానం ..07 |

కర్కాటక రాశి వారు ఈ ఏడాది ఒత్తిడిని చేయిస్తారు. ముఖ్యంగా కార్యాలయాల్లో అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటారు. కొందరికి పదోన్నతి వచ్చే అవకాశం ఉంటుంది. వ్యాపారులు కొత్త ఒప్పందాలను చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అయినా కూడా ఇవి అనుకూలమైన ఫలితాలే ఉంటాయి. కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు ఉండే అవకాశం ఉంటుంది. అర్హులైన వారికి వివాహ ప్రయత్నాలు సక్సెస్ అవుతాయి. జీవిత భాగస్వామితో కలిసి సంతోషంగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. ప్రతిరోజు తప్పకుండా నుదుటిపై కుంకుమ ఉండేలా చేస్తే చిన్నచిన్న దోషాలు తొలగిపోతాయి.

## సింహ రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..05 | వ్యయం.. 05 |
| రాజ పూజ్యం ..07, | అవమానం ..07 |

ఈ రాశి వారు ఈ ఏడాది డబ్బులను బాగా పొదుపు చేస్తారు. ఖర్చులను తగ్గించుకుంటారు. మొదటి అర్థభాగంలో ఈ పరిస్థితి ఉంటుంది. కానీ తర్వాత ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కొత్తగా వాహనం కొనాలని ప్రయత్నం చేసేవారు సక్సెస్ అవుతారు. విద్యార్థులు చదువుకోవడానికి ఇంటికి దూరంగా వెళ్తారు. అయితే ఈ రాశి వారి బలహీనతల వల్ల ఎదుటివారి నుంచి అవమానాన్ని పొందుతారు. వైవాహిక సంబంధాల్లో విభేదాలు ఉండే అవకాశం ఉంటుంది. శారీరకంగా ఆరోగ్యంగా ఉండే ప్రయత్నం చేయాలి. దోషాల నుంచి బయటపడాలంటే వెంట వెండి ఉండేలా చూసుకోవాలి.

## కన్య రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..08 | వ్యయం.. 11 |
| రాజ పూజ్యం ..03, | అవమానం ..03 |

ఈ రాశి వారు ఈ ఏడాది స్థిరాస్తులను పెంచుకుంటారు. కొత్త వాహనాలను కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా స్థిరపడేందుకు కొత్త వ్యక్తులను కలుస్తారు. ఈ ఏడాది చివరిలో అన్ని అనుకూలమైన ఫలితాలు ఉంటాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉంటారు. గతంలో ఉన్న సమస్యల నుంచి బయటపడతారు. వృత్తి జీవితంలో విజయాలను పొందే అవకాశం ఉంటుంది. అయితే వైవాహిక జీవితం కాస్త ఆందోళనగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు ఇబ్బందుని పెడతాయి. కొన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండి వెంటనే పరిష్కరించుకోవాలి. తల్లిదండ్రుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఈ రాశి వారు నల్ల ఆవుని సేవించడం వల్ల కొన్ని దోషాల నుంచి బయటపడతారు.

## కుంభ రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..02 | వ్యయం.. 08 |
| రాజ పూజ్యం ..04, | అవమానం ..02 |

ఈ రాశి వారు ఈ ఏడాది కొత్త ప్రాజెక్టులను సక్సెస్ చేసుకుంటారు. ఆరోగ్యం కుదుటపడుతుంది. ఆస్తికి సంబంధించి శుభవార్తను వింటారు. అయితే వాహనాలు కొనుగోలు చేయడం వాయిదా వేసుకోవడం మంచిది. పెట్టుబడులకు ఇదే మంచి సమయం. వ్యాపారులు ఘననీయంగా లాభాలు పొందుతారు. విద్యార్థులు పై చదువుల కోసం దూర ప్రయాణాలు చేస్తారు. వైవాహిక జీవితంలో కొన్ని అపార్థాలు ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి.

## మీన రాశి :

| | |
|---|---|
| ఆదాయం ..14 | వ్యయం.. 11 |
| రాజ పూజ్యం ..07, | అవమానం ..02 |

ఈ రాశి వారు కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారు. గతంలో ఉన్న ఇబ్బందుల నుంచి బయటపడతారు. అప్పుల ను తీర్చి సంతోషంగా గడుపుతారు. ఇంట్లో శుభకార్యం జరిగే అవకాశం ఉంటుంది. జీవిత భాగస్వామితో సంతోషంగా గడుపుతారు. అయితే ఉద్యోగులు కొన్ని సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. విద్యార్థులు కెరీర్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఈ రాశి వారు మర్రిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేయాలి.

## తుల రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..05 | వ్యయం.. 14 |
| రాజ పూజ్యం ..06, | అవమానం ..03 |

పరాభవ నామ సంవత్సరంలో తులా రాశి వారికి చేసే ప్రతి పనిలో విజయం సిద్ధిస్తుంది. ఉద్యోగస్తులకు ఈ ఏడాది అనుకూలమైన ఫలితాలు ఉంటాయి. కొత్త ఆస్తిని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తారు. విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొంటే విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న విభేదాలు తొలగిపోతాయి. వైవాహిక జీవితం సాధారణంగా ఉంటుంది. కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ వాటి నుంచి బయటపడతారు. అయితే సరైన ఆహారం తీసుకొని కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అర్హులైన వారికి వివాహ ప్రయత్నాలు సక్సెస్ కాకపోవచ్చు. ఈ రాశి వారు ఈ ఏడాది మాంసం, మద్యం నుంచి దూరంగా ఉండే ప్రయత్నం చేయండి.

## వృశ్చిక రాశి:

| | |
|---|---|
| ఆదాయం ..11 | వ్యయం.. 05 |
| రాజ పూజ్యం ..02, | అవమానం ..06 |

ఈ రాశి వారు ఈ ఏడాదిలో అనుకున్న ప్రతి అడుగు సక్సెస్ అవుతుంది. తోటి వారి మద్దతు కూడా ఎక్కువగా ఉంటుంది. అనుకోకుండా వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. ఖర్చులను తగ్గించుకుంటారు. కొత్త ఆస్తులను సంపాదిస్తారు. విద్యార్థులకు అనుకోకుండా అదృష్టం కలిసి వస్తుంది అయితే రెండవ అర్థభాగంలో జాగ్రత్తగా ఉండాలి. కుటుంబ జీవితంలో అశాంతి నెలకొనే అవకాశం ఉంటుంది. ప్రియమైన వారితో ఎలాంటి విభేదాలు లేకుండా చూసుకోవాలి. శరీరంపై వెండిని ధరించడం వల్ల కొన్ని దోషాల నుంచి బయటపడే అవకాశం.

## ధనస్సు రాశి:


| | |
|---|---|
| ఆదాయం ..14 | వ్యయం.. 11 |
| రాజ పూజ్యం ..01, | అవమానం ..02 |

ఈ రాశి విద్యార్థులు తమ కృషికి అనుగుణంగా ఫలితాలు పొందుతారు. చాలామంది వ్యాపారులు గతంలో నష్టపోయి ఉంటే ఇప్పుడు లాభాలు పొందుతారు. కొత్త ఆస్తిని కొనుగోలు చేయడానికి చేసే ప్రయత్నాలు సక్సెస్ అవుతాయి. వ్యాపారులకు కుటుంబ సభ్యుల తోడు ఉండడంతో లాభాలు ఎక్కువగా పొందుతారు. అధికారుల మద్దతు ఉండడంతో ఉద్యోగులు పదోన్నతి పొందే అవకాశం ఉంటుంది. కొన్ని నిర్ణయాలను వాయిదా వేయడమే మంచిది. ఉన్నత చదువుల కోసం దూర ప్రయాణాలు చేస్తారు. తల్లిదండ్రుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పక్షులకు, పశువులకు ఆహారం సమర్పించడం ద్వారా కొంతవరకు పరిహారం పొందవచ్చు.

## యుద్ధ తాంత్రిక

బ్రతకడమే యుద్ధమైన చోట
మళ్లీ మళ్లీ వాళ్లు యుద్ధాన్ని ప్రకటిస్తారు
ఈ దేశ పౌరులమైన మేము మా దేశం పట్లా ...!
అని ప్రతిజ్ఞ ముగియకుండానే, వాళ్లంతా
అభియోగం మోపబడి శిక్షించబడ్డ ఖైదీలా
ఓ సరళరేఖ మీద నిలబడి దురాక్రమణ సెగల్లో కాలిపోతారు
మిగిలిన వాళ్లంతా
రాలిపోయిన వాళ్ళ బూడిదను కుప్పలుగా పోసి రోధిస్తారు
తెల్లారాక
యుద్ధంలో వీరమరణం అనే ప్రకటన
ఏ చితికిన బతుకుల్ని అతికించగలదు
ఏ మెతుకుల్ని పండించగలదు
దేశాన్ని ప్రేమించడం అంటే యుద్ధంలో మరణించడం అని తెలిసిపోయింది.. దేశం కోసం యుద్ధాన్ని ప్రకటించిన వాడు మాత్రం
ఇంకా ఎందుకు మిగిలిపోయాడో
నాకు అర్థం కాలేదు

**పి.సుష్మ**
**మక్తల్**
**9959705519**








# శ్రీ పరాభవలో పౌర సమాజ గౌరవాన్ని పొందలేమా !

**(19 మార్చి "విశ్వావసు ఉగాది పర్వదినం" సందర్భంగా)**

ఉగాది లేదా యుగాది అనబడే చంద్ర సౌర క్యాలండర్ లేదా పంచాంగం ప్రకారం దక్షిణ భారత తెలుగు రాష్ట్రాలు, కర్నాటక ప్రజలు ఘనంగా నిర్వహించుకునే నూతన సంవత్సర తొలి రోజు వేడుక. 'యుగ' అనగా 'యుగం' అని, 'ఆది' అనగా 'ప్రారంభ' లేదా 'తొలి' రోజు అని అర్థం. పంచాంగం వివరాల ప్రకారం 60 సంవత్సరాల క్యాలెండర్ లేదా సాకా సంవత్ ప్రకారం, గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం తేదీ 19 మార్చి 2026 రోజున శ్రీ పరాభవ నామ నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్నది. చైత్ర శుక్ల పాడ్యమి శుభ గడియల్లో తెలుగు సంవత్సరాదిగా ఉగాది పర్వదినాన్ని జరుపుకోవడం ప్రతి ఏటా అనవాయితీగా వస్తున్నది.

**ఉగాది పర్వదినాన పరమార్థం:**

ప్రతి ఏట మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఈ పండుగ వస్తుంది. 12వ శతాబ్దపు గణితశాస్త్రవేత్త భాస్కరాచార్య ప్రారంభించిన ఉగాది పండుగను కృష్ణావతార సమాప్తి తర్వాత నిర్వహించడం విశేషం. పురాణాల ప్రకారం రాముడు వనవాసం పూర్తి చేసి అయోధ్యకు వచ్చిన శుభ గడియలను ఉగాదిగా భావిస్తారు. విశ్వాన్ని బ్రహ్మ సృష్టించిన తొలి రోజుగా కూడా ఉగాదిని పరిగణిస్తారు.

**భారతంలో పలు పేర్లతో యుగాది:**

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఉగాది పండుగ జరుపుకుంటూ ఉండగా మహారాష్ట్రలో గుడి పడ్వా, తమిళనాడులో పతండు, అస్సాంలో బిహూ, పంజాబ్‌లో బైసాఖీ, రాజస్థాన్‌లో తపన, మణిపూర్‌లో సాహిబ్ నోంగ్మా పంబ, పశ్చిమ బెంగాల్లో నబ వర్షా, సింధు సమాజంలో చెట్టీ ఛాంద్ పేర్లతో ఉగాదిని జరుపుకోవడం మన భారతీయ సాంప్రదాయం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యవసాయ సీజన్ ప్రత్యేకతగా ఉగాది పర్వదినం జరుపుకుంటున్నాం. ఆనందం, సంపదలు, సమన్వయ సమాజ వేడుకగా ఉగాదికి గుర్తింపు ఉన్నది.

**షడ్రుచుల ఉగాది పచ్చడి పరమార్థం:**

ఉగాదితో మొదలై నవరాత్రుల పాటు దుర్గా మాతను పూజించే సంస్కృతి కూడా ఉన్నది. ఈ పర్వదినం రోజున తార మర్ధనంతో స్నానాలు చేసి, తీపి చేదుల కలయికగా షడ్రుచుల ఉగాది పచ్చడి (వేప పువ్వు, మామిడి ముక్కలు, చింతపండు, బెల్లం లేదా చక్కెర, కారం లేదా పచ్చి మిరపకాయ, ఉప్పు)ని తీర్థప్రసాదాల వలె భావిస్తూ తీసుకొని జీవితంలో కష్టసుఖాలను పంచుకునే ధైర్యాన్ని పోగుచేసుకొని, మందిరాల్లో పూజలు చేసి, ఊరు వాడ సంబరాలు చేసుకొని, భక్షాలు లేదా బొబ్బట్లు లాంటి రుచికరమైన పిండి వంటలతో సరదాగా, భక్తి భావనలతో పంచాంగ శ్రవణాలకు హాజరై తమ రాశీ పలాలను తెలుసుకోవడం ఆచారంగా వస్తున్నది.

ఆరు రుచుల ఉగాది పచ్చడి జీవిత పరమార్థాన్ని వివరిస్తుంది. కష్టాల్లో కుంగడం, సుఖాల్లో పొంగడం సరియైన జీవన విధానం కాదని ఉగాది పర్వదినం బోధిస్తున్నది. ఆశావహ దృక్పథ సుగుణం, పరస్పర సహకార భావన, ఐక్యత, వివేకవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పౌర సమాజం శాంతి సౌభాగ్యాలతో ముందుకు సాగాలని కోరుకుందాం. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేద్దాం.



**డా: బుర్ర**
**మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## ఒక్క నిమిషం...!?

**ప్రభుత్వాలకు, విద్యా శాఖాధికారులకు, పాఠశాలలు.. పరీక్షా సంస్థలకు ఒక నివేదిక అనుసరించి రాస్తున్న వ్యాసం.**



పిల్లల పరీక్షలు - భయం కాదు, అవకాశం కావాలి!
ప్రతి సంవత్సరం మార్చిఏప్రిల్ నెలలు వచ్చేసరికి మన పిల్లల ముఖాల్లో రెండు రకాల భయాలు కనిపిస్తాయి.
ఒకటి - పరీక్షల భయం.
రెండు - "ఒక్క నిమిషం ఆలస్యం అయితే లోపలికి అనుమతించరు" అనే భయం. ఈ రెండు భయాలు కలిసి పిల్లల హృదయాలను బరువెత్తుతున్నాయి.
ఎవరు, ఎందుకు ఈ "ఒక్క నిమిషం" నిబంధనను రూపొందించారో తెలియదు. కానీ ఆ నియమం పిల్లల జీవితాలతో ఆడుకుంటోందని మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.
అసలే పరీక్షల ఒత్తిడి, తల్లిదండ్రుల ర్యాంకు ఆశలు, సమాజం ముందు "ఫాల్స్ ప్రెస్టీజ్" చూపించాలనే ఒత్తిడి - ఇన్ని భారాలు మోస్తున్న పసి ప్రాణాల మీద ఈ ఒక్క నిమిషం భారం ఎందుకు?
ఒక్క నిమిషం ఆలస్యం అయితే కొంప మునగదు.
కానీ ఆ ఒక్క నిమిషం కారణంగా ఏడాది శ్రమ, రాత్రి నిద్రలు త్యాగాలు, ఉపాధ్యాయుల సలహాలు - అన్నీ గాలిలో కలిసిపోతాయి. పేపరు సమయం ముగిసిన వెంటనే తీసేస్తే ఎలా? కానీ ఆలస్యంగా వచ్చిన వారికి కనీసం 5 నిమిషాలు గ్రేస్ టైమ్ ఇచ్చి, ఆ సమయంలో వారి ప్రయత్నం చేసుకునే అవకాశం కల్పించడం ఎందుకు కుదరదు? ఇది సమయపాలన కాదు - క్రూరత్వం.
పరీక్షా కేంద్రాల్లో డ్యూటీ చేసే అధికారులు కూడా కొత్తగా జాయిన్ అయిన సాయికుమారుల్లా భయపెడుతూ, ఒక్క నిమిషం కోసం పిల్లలను వెనక్కి తరిమేస్తున్నారు. మిగతా విషయాల్లో ఇంత స్ట్రిక్ట్‌గా ఎందుకు ఉండరు?
ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న.

**నా సలహాలు:**

>గ్రేస్ టైమ్ నిబంధన తీసివేయాలి
>పరీక్ష ప్రారంభం నుంచి 10 నిమిషాల వరకు వచ్చిన విద్యార్థులను అనుమతించాలి.
>ఆలస్యం అయినంత మాత్రాన వారి పూర్తి సమయం తగ్గించకుండా, మిగిలిన సమయం మాత్రమే ఇవ్వాలి. ఇది సమయపాలనను బోధిస్తూనే, మానవత్వాన్ని కూడా కాపాడుతుంది.
>పరీక్షా కేంద్రాల్లో మానసిక సహాయ కేంద్రాలు ప్రతి కేంద్రంలో ఒక కౌన్సెలర్ ఉండాలి.
>భయం, ఆందోళనతో వచ్చిన పిల్లలకు 23 నిమిషాల సలహా ఇచ్చి, శాంతంగా పరీక్ష రాసేలా చేయాలి.
>తల్లిదండ్రులు మరియు సమాజం బాధ్యత "ర్యాంకు రాలేదంటే జీవితం అంతం" అనే భయాన్ని తొలగించాలి.
>పరీక్ష అనేది జ్ఞానాన్ని పరీక్షించేది కానీ, పిల్లల వ్యక్తిత్వాన్ని కృంగదీసేది కాకూడదు.
ప్రభుత్వం బాధ్యత
రాష్ట్ర విద్యా శాఖ ఒక స్పష్టమైన సర్క్యులర్ జారీ చేసి, "ఒక్క నిమిషం" నియమాన్ని రద్దు చేయాలి.
ఇది చిన్న మార్పు కాదు - పిల్లల మానసిక ఆరోగ్యానికి పెద్ద మార్పు.
పరీక్షలు పిల్లల బలాన్ని పెంచాలి, వారిని కృంగదీయకూడదు. ఒక్క నిమిషం కోసం ఏడాది కష్టం వృథా కాకూడదు. ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, తల్లిదండ్రులు - అందరం కలిసి ఈ భయాన్ని తొలగించాలి.
ప్రతి విద్యార్థికి హృదయపూర్వక శుభాకాంక్షలు!
మీరు శాంతంగా, నమ్మకంగా, హాయిగా పరీక్ష రాయండి.
మీ కష్టం వృథా కాదు - అది మీ భవిష్యత్తుకు మార్గం అవుతుంది.
ఒక్క నిమిషం కోసం
ఒక జీవితం కాదు
దయచేసి ఆ నిబంధనను
తొలగించండి.
పిల్లలు నవ్వుతూ పరీక్ష హాల్లోకి వెళ్లే రోజు రావాలి!
అని ఆ కాంక్షిస్తూ....
మీ



**- సాధన.తేరాల,ఖమ్మం.**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19.03.2026
www.mudranews.in | @mudranews



**తోరణాలు కట్టడం**
ఉగాది రోజున ఇంటి తలుపుల వద్ద మామిడి ఆకులతో తోరణాలు కడతారు. ఇవి పాజిటివ్ ఎనర్జీని ఆహ్వానిస్తాయని నమ్మకం.

## అభివృద్ధికి నిధులు కేటాయించండి
### మంత్రి కోమటిరెడ్డిని కోరిన ఎమ్మెల్యే



**ముద్ర, మల్కాజిగిరి:**

మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరిలో నిర్మాణంలో ఉన్న కోర్టుల భవన సముదాయం పనుల పురోగతిపై మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సుమారు రూ. 90 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటికే దాదాపు 28.5 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ. 2.80 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు నెమ్మదించే పరిస్థితి ఏర్పడింది. ఈ బిల్లులు విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 3.6 కిలోల గంజాయి పట్టివేత



**ముద్ర, తాండూర్:**

తాండూర్ మండలం గౌతాపూర్ సమీపంలో బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండి ముస్తకిన్ దగ్గర 3. 6 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా నాపరాతి పాలిష్ యూనిట్లో కార్మికుడిగా పనిచేస్తున్న నిందితుడి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని, అతనిని అదుపులోకి తీసుకున్నారు.కేసు నమోదు చేసి రిమాండ్ కు తర లించినట్లు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో ఉగాది సంబరాలు

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**

ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పరాభవ సంవత్సర ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగాది సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. సంప్రదాయ వేషధారణలో పాల్గొని సహజసిద్ధంగా ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేశారు. ప్రిన్సిపల్ మదన్మోహన్, ఏవో మొహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉగాది శుభాకాంక్షలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లా ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, సరిత దంపతులు శుభాకాంక్షలు తెలిపారు.

**ముద్ర, వనపర్తి:**

వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, సుభిక్షం నిండాలని ఆకాంక్షించారు.

# కనుల పండువగా స్వామివారి కళ్యాణం

**ముద్ర, గద్వాల:**



పాల్గున అమావాస్య సందర్భంగా పాగుంటా శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా, శాంతిహోమం, పూర్ణాహుతి, చక్ర స్నానం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అలమేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం, అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పని చేతకాకపోతే సెలవుపై వెళ్లండి
### అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ముద్ర, వనపర్తి:**



వేసవిలో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులకు చేతకాకపోతే సెలవుపై వెళ్లాలని అధికారులపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి పట్టణంలోని తాగునీటి సరఫరాపై బుధవారం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వారం రోజుల్లో తాగునీటి సమస్యలన్నీ పరిష్కారం కావాలని అధికారులకు సూచించారు. రామన్ పాడు, ఎర్రగట్టు, కానాయపల్లి, గుంపుగట్టుల నుంచి సరఫరా అయ్యే నీటి వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించాలని ఎస్ఈ తిరుపతయ్యను ఆదేశించారు. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు నియమించిన 74 మంది ఉద్యోగస్తులు వేరే పనులు చేస్తున్నారని, వారికి తిరిగి తాగునీటి సరఫరా పనులను అప్పగించాలని సూచించారు. వాటర్ లైన్మెన్లతో మాట్లాడి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుగ్గపల్లి తండా, గుంపుగట్టు వద్ద విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ముద్ర, వనపర్తి:**

వనపర్తి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి తప్పులు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఈవో అబ్దుల్ ఘని, తహసీల్దార్ రమేష్ రె డ్డి పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**



పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న సందర్భంగా బుధవారం గద్వాల్ జిల్లా కేంద్రంలోని సరస్వతి టాలెంట్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ టి. శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బీఎన్ఎస్ సెక్షన్ ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ ఎస్సై -టూ సతీష్ కుమార్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## సేవ సంకల్పంతో ఆర్థికసాయం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



నాగర్ కర్నూల్‌లో క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రతిరోజు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు క్లాస్మేట్ క్లబ్ ప్రతినిధులకు మొత్తం రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమాల నిర్వహణకు వివిధ డివిజన్లకు నిధులు కేటాయించారు. ప్రతి సోమవారం కొల్లాపూర్ డివిజన్‌లో కార్యక్రమాల నిర్వహణకు ప్రతినిధి శ్రీదేవికి, మంగళవారం అచ్చంపేట డివిజన్ కార్యక్రమాల కోసం బంధం పరమేశ్వర ప్రసాద్‌కు , బుధవారం కల్వకుర్తి డివిజన్‌లో కార్యక్రమాల నిర్వహణకు యాద శోభన్‌కు, గురువారం నాగర్ కర్నూల్ డివిజన్ కార్యక్రమాల కోసం ఎండీ ఖాజాకు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో శని, ఆదివారాలు కార్యక్రమాల నిర్వహణకు బాలకృష్ణ, రవీందర్ రెడ్డిలకు. అలాగే ప్రభుత్వ సెలవు దినాల్లో కార్యక్రమాల నిర్వహణ కోసం బొప్పల్లి అల్లంపల్లి రమేశ్ రూ.50 వేల చొప్పున అందజేశారు. అలాగే శుక్రవారం వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కార్యక్రమాల నిర్వహణకు బి రాఘవేందర్‌కు రూ.60 వేలు, శనివారం గద్వాల, నారాయణపేట జిల్లాల్లో కార్యక్రమాల కోసం కే చంద్రకులకు రూ.40 వేలు అందజేశారు. వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ప్రయాణ ఖర్చుల కోసం దర్శి రాజయ్యకు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లాస్మేట్ క్లబ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వాస లక్ష్మీ రాఘవేందర్, రాష్ట్ర కార్యదర్శులు కెపి ప్రసాద్, కే లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి రమణ, ఉపాధ్యక్షులు సంబు శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ డివిజన్ కోశాధికారి ఆర్ సురేందర్, శ్రీనాథ్, సుధాకర్, వెంకటస్వామి, క్లాస్మేట్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూహెచ్‌లో మద్యంపై నిషేధం విధించాలి

**ముద్ర కుకట్‌పల్లి:**



జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోకి మద్యం, మత్తు పదార్థాల సరఫరాను అరికట్టాలని మరియు బయటి వ్యక్తుల వాహనాల పార్కింగ్‌ను తక్షణమే రద్దు చేయాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్యాంపస్‌లో మద్యం, డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాలి. అవసరమైతే ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు చేపట్టాలి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్యాంపస్‌ను 'గ్రీన్ క్యాంపస్'గా మార్చాలి. ఇందుకోసం ప్రధాన ద్వారం వద్దే 100 సైకిళ్లను అందుబాటులో ఉంచి, విద్యార్థులు, అధ్యాపకులు లోపలికి వెళ్లేందుకు వాటినే వాడేలా చర్యలు తీసుకోవాలి.బయటి వ్యక్తులు తమ వాహనాలను నెలల తరబడి క్యాంపస్‌లో పార్కింగ్ చేయడాన్ని నిలువరించాలి. విద్యార్థులు, అధ్యాపకుల వ్యక్తిగత వాహనాలను కూడా ప్రధాన ద్వారం వద్దే పరిమితం చేయాలి. మెట్రో ద్వారా వచ్చే వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకుల సౌకర్యార్థం పాలనా భవనం ఎదురుగా 'రివాల్వింగ్ గేట్' ఏర్పాటు చేయాలి.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు జవాజి దిలీప్, రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. యాజమాన్యం కేవలం సంఘటనలు జరిగిన తర్వాత శిక్షలు వేయడంపై కాకుండా, తప్పులు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. క్యాంపస్‌లో వాహనాల అతివేగం వల్ల గతంలో ప్రమాదాలు జరిగాయని, సైకిళ్ల వాడకం వల్ల అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీనివాసరావు, సాయి తనుజ్, శ్రీకాంత్, విశాల్, వసంత్, ప్రణయ్ చక్రవర్తి, ధీరజ్, జగదీష్, మరియు విద్యార్థి నాయకురాళ్లు సంగెం సిరి, లక్షి , భావన పాల్గొన్నారు.

## మైనార్టీలకు కానుకలు పంపిణీ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నియోజకవర్గం మైనార్టీ సోదరులందరికీ మసీదులో నిర్వహించిన రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు నిజాం, నజీమా, ఇస్తాక్ అహ్మద్ ఖాన్, ఆసిఫా బేగం ఖాదర్, కూచుకుళ్ల సింధు పాల్గొన్నారు.

### కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ ఛైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్ వసంత సంతోష్ గౌడ్, కూచుకుళ్ల నరసింహ రెడ్డి పాల్గొన్నారు

## కాగ్నా నీటితో తాగునీటి సమస్యకు పరిష్కారం

**ముద్ర, తాండూరు:**



తాండూర్ పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మున్సిపల్ యంత్రాంగం వడివడిగా అడుగులు వేస్తోంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా కాగ్నా నది నుంచి పట్టణానికి పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు నడుం బిగించింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చే ప్రక్రియలో భాగంగా బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్ల బృందం కాగ్నా నది వద్ద గల పంప్ హౌస్‌ను సందర్శించారు. యంత్రాల పనితీరు, నీటి నిల్వ సామర్థ్యం, సరఫరాలో తలెత్తుతున్న ఆటంకాలను వారు పరిశీలించారు. పాత యంత్రాల స్థానంలో కొత్త టెక్నాలజీని ఉపయోగించి నీటి పంపింగ్‌ను వేగవంతం చేయాలని, ప్రజలకు పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన సురక్షిత జలాలను అందించాలని, వేసవి దృష్ట్యా నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం లాంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తాండూర్ ను నీటి ఎద్దడి లేని పట్టణంగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే లక్ష్యమని అన్నారు. అతి త్వరలో పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుంటే నిరసనలు ఉధృతం

**ముద్ర, శేరిలింగంపల్లి :**



ఆరు గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వెంటనే అమలు చేయాలని పోరాటం ఉధృతం చేయాల్సి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్ డిమాండ్ హెచ్చరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గచ్చిబౌలి, కొండాపూర్, లింగంపల్లి, హఫీజ్ పేట్, మియాపూర్, డివిజన్ల నాయకులు స్థానిక తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్‌మాట్లాడుతూ అంతకుముందు పదేళ్ల లో బీఆర్ఎస్, ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు బీజేపీ పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఎల్లేష్, జితేందర్, లక్ష్మణ్ ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, ఆంజనేయులు సాగర్,రమేష్ , విభూషణ్ రెడ్డి, విష్ణు దత్ వెంకటేష్, గణేష్ ముదిరాజ్ ,రాము, శ్రీనివాస్ యాదవ్ పద్మ , విజయలక్ష్మి , జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

## గ్యాస్ కొరత లేదు



**ముద్ర, గద్వాల:**

గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాలలో గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో గ్యాస్ కొరత ఎక్కడా లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు .కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులున్నారు.

## ఏటీసీ నిర్మాణానికి స్థల పరిశీలన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో మంజూరైన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. స్థల పరిమాణం, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. కల్వకుర్తి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపల్, మండల తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి




**ముద్ర, కాప్రా:**

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహా పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సీగ్రౌండ్స్లో 12 నుంచి 17 వరకు నిర్వహించిన భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బీపీఎల్) గెలుపొందిన తపస్యా, నృపతుంగ జట్ల విజేతలకు ఈటీ. నర్సింహా, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సాంస్కృతిక కళామండలి సభ్యులు పల్లె నర్సింహా, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర బహుమతులు అందజేశారు.

## గుర్రపుడెక్క తొలగింపు

**ముద్ర, బోడుప్పల్:**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలో చెరువులలో, నీటి మడుగుల్లో పెరిగిన గుఱ్ఱపు డెక్కను తొలగించే కార్యక్రమాన్ని బుధవారం యంత్రాల సహాయంతో మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఈ పనులను డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ, పీర్జాదిగూడ చెరువులో ప్రారంభించి అనంతరం దోమల లార్వా నిర్మూలనకు గంబూసియా చేపలను నీటిలో విడిచిపెట్టారు. డిఈఈ కె. జహ్నవి శశాంక పాల్గొన్నారు.

## హుండీ లెక్కింపు

**ముద్ర, తాండూర్:**

తాండూర్ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన భద్రేశ్వర స్వామివారి హుండీని బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షతన లెక్కించింది. హుండీ ద్వారా రూ. ఒక లక్ష 22 వేల 736 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు మేడి మహేష్ కుమార్, ఈవో శేఖర్ గౌడ్, డైరెక్టర్లు, వీరశైవ సమాజం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మిల్లర్లు బియ్యాన్ని ఎఫ్ సీ ఐ కి తరలించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**




మిల్లర్ల దగ్గర ఉన్న బియ్యాన్ని త్వరితగతిన ఎఫ్.సి.ఐ కి తరలించాలని కలెక్టర్ దీపక్ తివారి మిల్లర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేటులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణకై సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళికపై రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రబీ ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని 129 ధాన్యం సేకరణ కేంద్రాలను అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, డిప్యూటీ డీఆర్డీఏ నరసింహులు, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలేష్ గుప్త, శ్రీనివాస్ గుప్త, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ముగ్గులు వేయడం**

ఉగాది రోజు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేయడం ఆనవాయితీ. ఇది ఆనందం, శుభం, సంపదకు సంకేతం.




# విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

**- కలెక్టర్ అభిలాష అభినవ్**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సగం ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. వారు అబలలు కాదు సబలలు అని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభివృద్ధికి పురుషుల సహకారం కూడా అవసరమని, సమాన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. విజయవంతమైన మహిళలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. మహిళా ఉద్యోగులకు పని ప్రదేశాల్లో ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఖజానా శాఖ అధికారి సరోజ, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## బోథ్ లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో తన నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గం కేంద్రమైన బోథ్ లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. బోథ్ లో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి స్థాయి లో డాక్టర్లను నియమించాలని కోరారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పలు భవన నిర్మాణాలకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

## జవహర్ నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక






**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం లోని వేదం పాఠశాల విద్యార్థి వెండి శివసాయి, నాగభూషణం పాఠశాల విద్యార్థి పట్ల అకిరానందన్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, కిషోర్ కుమార్ లు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు.

## యువకుడికి గాయాలు

**ముద్ర, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లో అడవి పంది దాడిలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన జాదవ్ ప్రవీణ్ బుధవారం తన ఇంటి పరిసరాలు శుభ్రం చేస్తుండగా అతడిపై ఓ అడవి పంది దాడి చేసింది. ప్రవీణ్ గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి అక్కడి నుంచి పందిని తరిమికొట్టారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఈ-నామ్ 2.0 అమలుపై సమీక్ష



**ముద్ర, కరీంనగర్:** వ్యవసాయ మార్కెటింగ్ లో సామర్థ్యం, పారదర్శకత, జవాబుదారితనం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ–నామ్ 2.0 అమలుపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. తెలంగాణలో ఈ నామ్ కింద 57 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఎంపిక కాగా కరీంనగర్ జిల్లాలో ఐదు ఉన్నాయి. ఇందులో కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఈ కమిటీల్లో ఈ–నామ్ 1.0 అమలు అవుతోంది. మెరుగైన ఫీచర్లు అత్యుత్తమ వర్షన్ లో 2.0 ను ప్రభుత్వం ప్రవేశపెట్టగా చొప్పదండిలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ ఈ నామ్ 2.0 ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడుతుందని తెలిపారు. ఈ విధానంలో వ్యవసాయదారులు వ్యాపా రులు, కమీషన్ ఏజెంట్లు ఒకే డిజిటల్ వ్యవస్థలోకి వస్తారని పేర్కొన్నారు. తద్వారా మార్కెటింగ్ సామర్థ్యం, పారదర్శకత, జవాబుదారితనం చాలా మెరుగుపడతాయని చెప్పారు. కాగా 2.0 లో ఎదురైన సాంకేతిక సమస్యలను ఉన్న తాధికారులకు నివేదించి మరింత విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్, మార్కెటింగ్ శాఖ అధికారులు, ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతో అధిక దిగుబడి



**మహాదేవపూర్, ముద్ర:** కూరగాయల సాగుతో అధిక దిగుబడి వస్తుందని ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి వై.మణి తెలిపారు. మండలంలోని మద్దులపల్లిలో బుధవారం ఉద్యాన పంటలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ ఎల్పుల సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ అధికారి వై.మణి మాట్లాడుతూ మహాదేవ్‌పూర్ డివిజన్ పరిధిలోని మండలాల్లో సుమారు 250 ఎకరాల్లో కూరగాయల సాగు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. ఉప సర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు దేవిక, శ్రావణి, శ్రీజ, మన క్క, హెచ్ఈఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

**మునగ తోట పరిశీలన..**

మండలంలోని మద్దులపల్లిలో రైతు ఐలక్క సాగు చేస్తున్న మునగ తోటను డివిజన్ ఉద్యాన శాఖ అధికారి వై.మణి పరిశీలించారు. సర్పంచ్ సరితతో కలిసి తోటను సందర్శించి పంట సాగు విధానాలు, దిగుబడులపై రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మునగ చెట్ల సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ హెచ్ఈఓ రాందాస్ పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేయాలి




**మహాదేవపూర్, ముద్ర:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామిశెట్టి మనోజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలువురు నాయకులతో కలిసి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ఆసరా పెన్షన్ల పెంపు, రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీ, వంట గ్యాస్ సబ్సిడీ వంటి పలు పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా మాయ మాటలు చెప్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్ కుమార్, మండల నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దడిగెల వెంకటేష్, కొక్కు రాకేష్, బల్ల సంపత్, హరీష్ చంటి, రాకేష్ పాల్గొన్నారు.

## కాకతీయలో ముందస్తు ఉగాది వేడుకలు




**ముద్ర, మంథని:** మంథని పట్టణంలోని కాకతీయ పాఠశాలలో బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఉగాది పచ్చడి, భక్ష్యాలు అందరికీ పంపిణీ చేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా పార్వతి పరమేశ్వర కల్యాణం

**- హాజరైన కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్ రావు**



**ముద్ర, కరీంనగర్:** నగరంలోని పాత బజార్ శివాలయంలో బుధవారం పార్వతి పరమేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివార్లకు రాజేందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు పురాణం మహేశ్వర శర్మ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల నందిని, ఉదయ్, కాంగ్రెస్ నాయకులు జల్లోజు శ్రీనివాస్, రేగొండ సందీప్, దుగ్గు మహేందర్, పోరెడ్డి శ్రీధర్, పోరండ్ల రమేష్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విత్తన బంతుల తయారీ




**మహదేవ్‌పూర్, ముద్ర:** పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవుల పెంపకమే లక్ష్యంగా మండలంలోని సురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం విత్తన బంతులను తయారు చేశారు. నేషనల్ గ్రీన్ కోర్ లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించింది. పాఠశాల ఎకో–క్లబ్ విద్యార్థులు మట్టి, ఎరువు, దేశవాళీ విత్తనాలతో వేప, నేరేడు, చింత మొదలైన వందలాది విత్తన బంతులను సిద్ధం చేశారు. ఎంఈఓ విద్యార్థుల పనితీరును అభినందించారు. ఈ విత్తన బంతులను వర్షాకాలంలో ఖాళీ ప్రదేశాలు, అటవీ ప్రాంతాల్లో వెదజల్లనున్నట్లు ప్రధానోపాధ్యాయులు మెతుకు పురుషోత్తం రెడ్డి తెలిపారు.

## ముందస్తు ఉగాది వేడుకలు



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం ఆదర్శ పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. కేశవపట్నం ఆదర్శ పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించారు. ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. పండుగ ఆవశ్యకత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి జయంతి


**మహాదేవపూర్, ముద్ర:** మండల కేంద్రంలో బుధవారం మంథని మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాంరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ రాంరెడ్డి ముత్తారం మండలం ఖమ్మంపల్లి సర్పంచ్ గా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి ఎమ్మెల్యేగా ఎదిగారని తెలిపారు. ఆయన భౌతికంగా దూరమైనా, ప్రజల గుండెల్లో చిరకాలం కొలువై ఉంటారని పేర్కొన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అంకరి రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి బల్ల శ్రవణ్ కుమార్, మండల నాయకులు కన్నెబోయిన ఐలయ్య, జనసేన నాయకులు కాల్వ రాజశేఖర్, యువ నాయకులు వెంకటేష్, సంపత్, రాజు, రాకేష్, హరీష్, చంటి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19-03-2026
www.mudranews.in | @mudranews



కొత్త బట్టలు ధరించడం

ఉగాది రోజు కొత్త బట్టలు వేసుకోవడం కొత్త ప్రారంభాన్ని సూచిస్తుంది. ఇది ఉత్సాహాన్ని పెంచుతుంది.




# దీర్ఘకాలిక ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**- సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు**



__ముద్ర, మోత్కూర్:__

ప్రభుత్వాలు పాలకులు మారుతున్న మండలంలోని దీర్ఘకాలిక ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎన్నికలప్పుడు మాత్రమే హామీలు ఇచ్చి అమలు చేయ దంలో విఫలమవుతున్నారని దీర్ఘకాలిక ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. బుధవారం మోత్కూర్ మండలం పాలడుగు సిపిఎం గ్రామ శాఖ సమావేశం వెండి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకట నర్సు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్న దీర్ఘకాలిక సమస్యలైన ఆర్టీసీ డిపో, 30 పడకల ఆసుపత్రి, పోస్ట్ మార్టం సౌకర్యం, ప్రభుత్వ డిగ్రీ కాలేజి, రెవిన్యూ డివిజన్, సివిల్ కోర్ట్, గురుకులాలకు సొంత భవనాలు, గుండాల మోత్కూర్ మధ్య బిక్కేరు వాగుపై బిడ్జి నిర్మాణం లాంటి సమస్యల పరిష్కారానికి మండల ప్రజలు దశబ్దాలుగా ఎదురుచూస్తున్నారని అన్నారు. గత ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దాదాపు రెండు సంవత్సరాలు గడచిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. బునాది గాని కాల్వ పనులు పూర్తి చేస్తామని రూ.261 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించి ఏడాది దాటిన ఇప్పటి వరకు పనులు ప్రారంభించ లేదని అన్నారు. నిధులు లేవన్న సాకుతో అనేక గ్రామాలలో నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే మండల ప్రజా సమస్యలను పరిష్కరించి, ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

**- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందడి ఉపేందర్**



__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

ప్రభుత్వ ఉద్యోగులకు 2023 నుండి రావలసిన పీఆర్సీని వెంటనే అమలు చేసి రావాల్సిన 4 డి.ఏ.లు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు సి.జగన్మోహన్ ప్రసాద్, కార్యదర్శి సి.హెచ్. శ్రీనివాస్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తరువాత వారికి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. 60 మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణకు సంబందించిన డబ్బులు అందక అనారోగ్యపరమైన ఖర్చులకు డబ్బులు చెల్లించలేక మరణించారని విచారణ వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒప్పుకున్న ఎంప్లాయి హెల్త్ స్కీం ఏప్రిల్ 01, 2026 నెల నుండి అమలయ్యే విధంగా చూడాలన్నారు. అన్ని శాఖలలో ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేసి అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పించాలన్నారు.

ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ట్రెజరర్ హరికృష్ణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు సాయికృష్ణ, యం. రోజారాణి, యస్. సైదులు, ఎ. శ్రీనివాస్ రెడ్డి, యం.డి. అజీర్అలీఖాన్, శ్రీకాంత్ రెడ్డి, అసోసియేషన్ సెక్రటరీస్ ప్రవీణ్ కుమార్, ప్రసాద్, బాలమణి, భరత్, చంద్రారెడ్డి, డా||పి, చైతన్య పాల్గొన్నారు.

## రామన్నపేట ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలి

__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని, ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నూతన ఆసుపత్రి భవనానికి 40 కోట్ల రూపాయలు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 3 రోజులుగా రామన్నపేట మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెల్లెల్ల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేష్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నరసింహ చారి, కందుల హన్మంతు, మండల కమిటీ సభ్యులు గొరిగె సోములు, నాగాటి ఉపేందర్, వేముల సైదులు, శానకొండ రామును బుధవారం కలిసి సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు.

## టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో డీపీఆర్వో అరుంధతికి ఘన సన్మానం



__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టియుడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీపీఆర్వో యు.అరుంధతిని బుధవారం కలెక్టరేట్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు శాలువా కప్పి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా డీపీఆర్వో మాట్లాడుతూ మహిళా జిల్లా అధికారిగా టియుడబ్ల్యూ జే (ఐజేయు) ఆధ్వర్యంలో సన్మానించి గౌరవించినందుకు యూనియన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు యంబ నరసింహులు, జిల్లా కార్యదర్శి పోతంశెట్టి కరుణాకర్, ఐజేయు కౌన్సిల్ మెంబర్ జీవి.శ్రీనివాస్, టీయూ డబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్, అక్రిడేషన్ కమిటీ మెంబర్ వెలిమినేటి జహంగీర్, యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు జి. కృష్ణారెడ్డి, నాయకులు కందుకూరు సోమయ్య, పురుగుల మల్లేశం, గుండు ప్రసాద్, తాళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్**




__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఇటీవల భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, మహిళ ఖోఖో క్రీడలలో విజేతలకు ఈ నెల 22న ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, పొన్నాల చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు నరోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు పడమటి జగన్మోహన్ రెడ్డి, ఏలే చంద్రశేఖర్, రచ్చ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అచ్చయ్య, కొప్పుల యాది రెడ్డి, చంద మహేందర్ గుప్తా, జిల్లా కార్యదర్శులు వైజయంతి తడిసిన మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం పాల్గొన్నారు.

## ఉగాది పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య**



__ముద్ర, మోత్కూర్:__

మోత్కూర్ లో ఉగాది పర్వదినం సందర్భంగా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో గల అమ్మవారి దేవాలయాల వద్ద మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, కమిషనర్ కె సతీష్ కుమార్ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, కమిషనర్ కే సతీష్ కుమార్ మాట్లాడుతూ ఉగాది పండగ మోత్కూర్ లో అతి పెద్ద పండుగ అని ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండగ జరుపుకోవాలని అన్నారు.

## కరపత్రాలు ఆవిష్కరణ



__ముద్ర, మోత్కూర్:__

హైదరాబాద్ లో ఈ నెల 30న సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహించే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరపత్రాలు మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెల్ల రమేష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు రాంపాక రాములు, మండల ఇన్చార్జి కూరెళ్ల సైదులు, మండల అధ్యక్షుడు బందెల శ్రీను, యువసేన మండల అధ్యక్షుడు పల్లె నవీన్, టౌన్ అధ్యక్షుడు కూరెళ్ల చిన్న, కూరెళ్ళ సందీప్, రుద్రవెల్లి గణేష్, కళ్లెం రమేష్ పాల్గొన్నారు.

## యాదవులు ఏకం కావాలి

**- జంగ శ్రీను యాదవ్**




__ముద్ర, మోత్కూర్:__

రాజకీయాలకు అతీతంగా యాదవులు ఏకం కావాలని అఖిలభారత యాదవ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా శ్రీను యాదవ్ అన్నారు. మోత్కూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన యాదవ కౌన్సిలర్ లు కొండ శోభా సోంమల్లు, నల్ల మధు లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీను యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు పురుగుల మల్లయ్య, ఉపాధ్యక్షులు జంగా వెంకట నరసయ్య, నాయకులు అవిశెట్టి స్వామి, గజ్జి మల్లేష, జంగ నరసయ్య, సతీష్, పురుగుల రమేష్, లింగయ్య, మేడబోయిన నరేష్, శ్రీను, అవిశెట్టి ముత్యం, బిక్షం, వర్రె రాములు, జంగా శివ, సమ్మయ్య, బుర్ర శివ మల్లేష్, దండేబోయిన వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలి

**- ఎండోమెంట్ డైరెక్టర్ హనుమంతు రావును కలసిన దళిత సంఘాల ప్రతినిధులు**



__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని ఎండోమెంట్ డైరెక్టర్ ఎం.హనుమంతు రావును దళిత సంఘాల ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానంలో గత కొన్ని నెలలుగా దళిత వర్గాల ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ అంశం పై విచారణ జరిపి దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్ర స్వామి మాదిగ, దళిత ఐక్యవేదిక చైర్మన్ భట్టు రాంచంద్రయ్య మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, జర్నలిస్ట్ సంఘం నాయకులు వినియోగదారుల ఫోరం నాయకులు ఎలిమినేటి నగేష్ పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సహకరించాలి

**- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సురక్షితమైన ఉత్పత్తులు, నమ్మకమైన వినియోగదారులు అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. కల్తీ వస్తువులను అధిగమించడానికి చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యావంతులకే కాక సామాన్యులకు కూడా సరైన న్యాయం జరిగినప్పుడే ప్రపంచ వినియోగదారుల దినోత్సవానికి సార్ధకత అని తెలిపారు. నాణ్యమైన వస్తువు సేవలను పొందడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కని అన్నారు. సురక్షితమైన ఉత్పత్తులు మాత్రమే అందుబాటులో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులకు, అనుబంధ సభ్యులకు వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సేవలు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 సంప్రదించవచ్చన్నారు.




ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారి హరికృష్ణ, జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ,జిల్లా మెట్రాలజీ అధికారి వెంకటేశ్వర్లు, వినియోగదారుల ఫోరం సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

__ముద్ర, తుర్కపల్లి :__

బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, గైర్హాజరు వివరాలను సంబంధిత పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులను ప్రధాన గేట్ వద్ద పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి పంపించాలని చెప్పారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలను పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల జీరాక్స్ కేంద్రాలు మూసి వేసేలా చూసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ జరగరాదని, పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు.



## ఆటోను అందజేసిన కలెక్టర్

__ముద్ర ప్రతినిధి, భువనగిరి :__

అజీవిక గ్రామీణ ఎక్స్ప్రెస్ యోజన స్కీంలో మోటకొండూరు గ్రామానికి చెందిన సమ భావన సంఘాల మహిళ నాంపల్లి భార్గవికి మంజూరైన ఆటోను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం కలెక్టరేట్ లో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీఆర్ డీఏ అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**షడ్రుచుల ఉగాది పచ్చడి**

ఉగాది రోజున చింతపండు, బెల్లం, మామిడి, మిరప, ఉప్పు, వేప పువ్వులతో చేసే ఉగాది పచ్చడి జీవితం లోని ఆరు రుచులను సూచిస్తుంది.



# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

- **మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలని అన్నారు. సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల ఓటు నమోదు కాకుండా జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ద్వారా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించడంతో పాటు బీఎల్ఓలకు ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మరణించిన ఓటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, రాజకీయ పార్టీల నాయకులు గడ్డం శ్రీనివాస్, సయ్యద్ ఇస్రాత్, సలీం, దేవిసింగ్, గౌస్ కురేషి, నర్సమ్మ, స్వామి దాస్, ఆర్డీఓలు జయ చంద్ర రెడ్డి, రమాదేవి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# బాధితులకు భరోసా

- **మెదక్ అదనపు ఎస్పీ మహేందర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

లైంగిక వేధింపుల బాధితులకు భరోసా సెంటర్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తీరును సమీక్షించారు. లైంగిక వేధింపుల బాధితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారికి భయాందోళన కలగకుండా ధైర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు తక్షణమే న్యాయ, వైద్య సహాయం అందించడంతో పాటు మానసిక బలం చేకూర్చాలని ఆదేశించారు. పోక్సో, అత్యాచార బాధితుల వైద్య పరీక్షల కోసం ప్లాన్ ఇండియా ఎన్జీఓ 200 మెడికల్ కిట్లను అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా సిబ్బంది, ప్లాన్ ఇండియా ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేష్, సామాజిక కార్యకర్తలు భార్గవి, రవి పాల్గొన్నారు.




# షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి సహకరించాలి

- **బ్యాంకర్లను కోరిన అడిషనల్ కలెక్టర్ పాండు**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి**

ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన యూనిట్లకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళిక 2025-26 కింద సంగారెడ్డి జిల్లాకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ పాండు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్‌డీఎం, నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం క్రిష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారని, అనంతరం స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు.





# ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

- **రైతులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచన**
- **తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. బుధవారం కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో అధిక సాంద్రత సాగుపై కిసాన్ మేళా నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఏర్పాటు చేసిన ప్రదర్శన వీక్షించి రైతులతో ముచ్చటించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వాణిజ్య పంటలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెయ్యి మంది రైతులు పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లా గ్రంథాలయాల చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. రైతు లేనిదే మనుగడ లేదన్నారు. రైతులు నష్టాలకు ఓర్చి భూమిని నమ్ముకొని ఆశలతో బతుకుతారని, వారిని ఎంతైనా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ ఫామ్ సమస్యలను కూడా అధికారులు రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీఓ రామకృష్ణ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నల్కర్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, స్థానిక సర్పంచ్లు ,రైతులు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా అక్రమంగా ఉపయోగిస్తున్న 52 నాన్ కమర్షియల్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు. బుధవారం పట్టణంలో వివిధ హోటల్స్, టీ పాయింట్లలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు నిర్వహించారు. 52 గృహ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం, 1955 లోని సెక్షన్ 6ఎ కింద కేసులు నమోదు చేసినట్లు నిత్యానంద్ తెలిపారు.

## నాడు అవినీతి చేసి..
# నేడు అభివృద్ధిని అడ్డుకుంటారా..

- **సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



10 సంవత్సరాలలో సిద్ధిపేటలో అభివృద్ధి పేరుతో ఎంత అవినీతి చేశారో ముందు ప్రజలకు చెప్పలని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. సిద్ధిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నంగునూరు మండలంలో నర్మెట్ట గ్రామంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రజల ధనంతో కట్టారన్నారు. 10 సంవత్సరాలలో దోచుకున్న సొమ్ముతో కట్టినట్లు బిఆర్ఎస్ నాయకులు తెగ ఫీల్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీనీ ప్రజలకు ఉపయోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యాకరీ ప్రారంభించేందుకు వస్తుంటే ఆయన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని బిఆర్ఎస్ చెప్పడం బాధాకరమని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు అడ్డుకుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. గత పాలకులు రాష్ట్ర ఖజానాకు దోచుకొని నయా పైసా లేకుండా చేశారని, వారు చేసిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెల్లిస్తు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గాయాజుద్దీన్ హర్షద్ రాజిరెడ్డి శేఖర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ

- **ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావు**
- **మెదక్ లో ముస్లింలకు ఇఫ్తార్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ రాష్ట్రం అని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్స్ లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహకారం పెంపొందించే పవిత్రమైన కాలమన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముస్లిం సోదరుల అభ్యున్నతికి విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని మతాలు, వర్గాలు కలిసి జీవించే సంస్కృతికి నిలయమని తెలిపారు. అనంతరం ఇఫ్తార్ లో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, ఆర్డిఓ రమాదేవి, ఏఎస్పి మహేందర్, డిఎస్పి ప్రసన్న కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ లు తొడుపునూరి చంద్రపాల్, గూడూరి కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్ రావ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాదర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు తొడుపునూరి శివ రామకృష్ణ, గంట సంపత్, శశాంక్, మన్సూర్, హరిత, జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, బొజ్జ పవన్, మ్యాడం బాలకృష్ణ, గూడూరి ఆంజనేయులు గౌడ్, సలీం, హాఫిజ్, సమీ, మంగ మోహన్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, హంజద్, ముత్యంగౌడ్ ఉమర్, హమీద్ మహేష్‌గౌడ్, ప్రవీణ్ గౌడ్, శంకర్ గౌడ్, నిఖిల్, ఖాలేక్, తాహెర్, కొండా శ్రీను గుప్తా, బాలరాజ్, దిలీప్, తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం నిరూపేద ముస్లింలకు తోఫాలు అందజేశారు.

# ఓటరు జాబితాలో తప్పులు ఉంటే చర్యలు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

ఓటరు జాబితాలో తప్పులు ఉంటే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్, ఇంటింటి సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలకు తాకిదులు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి నిజమైన ఓటర్లను గుర్తిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఈ ఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్వోలు, సూపర్వైజర్ల ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పటాన్ చెరువు, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన ఈఆర్ఓలు, ఏ ఈఆర్ఓలు, బిఎల్వోలు, సూపర్వైజర్లతో వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.., ప్రతి బిఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసం నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. బిఎల్ఓ లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియలో నిర్లక్ష్యం వహించే బిఎల్వోలకు తాకిదులు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్వో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బిఎల్వోలు లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే బిఎల్వోలను నియమించాలని ఈఆర్ఓ లను ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 13 కేటగిరీలలో బిఎల్వోలను నియమించుకోవచ్చని అన్నారు. బిఎల్వోల వివరాలను ఈసీఐ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రాజేందర్, ఎన్నికల విభాగం సెక్షన్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలతో దేశం అస్తవ్యస్తం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని, ఈనెల 24న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మోడీ పాలనలో దేశంలో ప్రజలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు పెంచే విధానాలను మోడీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈనెల 16న ప్రజాస్వామ్య యుతంగా ధర్నాలో పాల్గొన్న అంగన్వాడి టీచర్లు, హెల్పర్లకు మెమో జారీ చేసిన వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేశ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జె సంతోష్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### పంచాంగ శ్రవణం వినడం

ఉగాది పండుగ నాడు పండితులు చెప్పే పంచాంగ శ్రవణం వినడం ద్వారా కొత్త సంవత్సర ఫలితాలను తెలుసుకుంటారు. ఇది ఆధ్యాత్మికంగా ముఖ్యమైనది.





## 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

- జాతీయ స్థాయి పరిణామాలు, నియోజకవర్గాల పునర్విభజనతో ఆలస్యం
- డ్రగ్స్ ను ఉక్కుపాదంతో అణిచివేస్తాం
- దాని వెనక ఎవరున్నా ఉపేక్షించం
- మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ ఘటనను సీరియస్ గా తీసుకున్నాం
- అందుకే 9మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేశాం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

ముద్ర, న్యూఢిల్లీ :

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయన్న ఊహాగానాలకు సీఎం రేవంత్ రెడ్డి చెక్ పెట్టారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే 2028లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం కనిపించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేసిన సీఎం కీలక అంశాలపై మాట్లాడారు. జాతీయ స్థాయి పరిణామాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో 2029లోనే ఎన్నికలు జరిగే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అందరూ ఊహిస్తున్నట్లు 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయ పడ్డారు. తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. డ్రగ్స్ ను ఉక్కుపాదంతో అణిచివేస్తామని స్పష్టం చేశారు. డ్రగ్స్ విషయంలో ఎంతటి వారి ప్రమేయం ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని లోపాలను సరిదిద్దుతూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందన్నారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ఇప్పటికే తొమ్మిది మంది అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నిఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేసులో ఏలూరు ఎంపీ (పుట్టా మహేష్ కుమార్) పట్టుబడ్డారన్నారు. ప్రస్తుతం ఆయన స్టేషన్ బెయిల్ మీద బయట తిరుగుతున్నారని చెప్పారను. అయితే ఇందులో తమ ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీఎం స్పష్టం చేశారు. అంతకుముందు పార్లమెంట్ లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు.

LTM

## ఎన్‌పీఎన్‌కు రైజింగ్ స్టార్ కన్సల్టింగ్ పార్టనర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ముద్ర, ముంబై:

ప్రపంచంలోని అతిపెద్ద సంస్థలకు బిజినెస్ క్రియేటివిటీ భాగస్వామిగా సేవలందిస్తున్న ఎల్టిఐమ్ (LTM) సంస్థకు ప్రముఖ సాంకేతిక సంస్థ ఎన్విడియా నిర్వహించిన జిటిసి 2026 సందర్భంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డు లభించింది. ఎన్విడియా పార్టనర్ నెట్‌వర్క్ (ఎన్‌పీఎన్) కింద 'రైజింగ్ స్టార్ కన్సల్టింగ్ పార్టనర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ఎల్టిఐమ్‌కు వరించింది .ఈ అవార్డు ద్వారా ఎన్విడియాతో ఎల్టిఐమ్ కొనసాగిస్తున్న బలమైన భాగస్వామ్యం ప్రతిఫలించింది. సంస్థలు కేవలం ఏఐ ప్రయోగాల దశలోనే కాకుండా, విస్తరించదగిన సంస్థాగత స్థాయి అమలుకు మారేలా సహకరించడంలో ఎల్టిఐమ్ కీలక పాత్ర పోషిస్తోందని గుర్తించారు.

ఎన్విడియా పార్టనర్ నెట్‌వర్క్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సాంకేతిక, కన్సల్టింగ్ భాగస్వాములను ఒక వేదికపైకి తీసుకు వచ్చే పర్యావరణ వ్యవస్థగా నిలుస్తోంది. ఈ నెట్‌వర్క్‌లో భాగస్వామిగా ఉండటం ద్వారా ఎల్టిఐమ్ తన పరిశ్రమ నైపుణ్యాన్ని ఎన్విడియా ఆధునిక ఏఐ సాంకేతికతలతో మేళవించి, క్లయింట్లకు వాస్తవ ఫలితాలను అందిస్తోంది.ప్రత్యేకంగా ప్రొడక్షన్ స్థాయి, సురక్షితమైన మరియు ఎంటర్‌ప్రైజ్ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఏఐ పరిష్కారాలను వేగంగా అందించడంలో ఎల్టిఐమ్ సామర్థ్యాన్ని ఈ అవార్డు ప్రతిబింబిస్తుందని సంస్థ పేర్కొంది.

ఈ సందర్భంగా ఎల్టిఐమ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ వేణు లంబు మాట్లాడుతూ, "ఎన్విడియా పార్టనర్ నెట్‌వర్క్‌లో భాగమవడం అరుదైన అవకాశం. ఇది మమ్మల్ని ఆవిష్కరణల కేంద్రంలో నిలబెడుతుంది. ఎన్విడియా నిపుణులతో ప్రత్యక్ష సహకారం ద్వారా ఎంటర్‌ప్రైజ్ స్థాయి ఏఐ పరిష్కారాలను వేగంగా అభివృద్ధి చేసి అమలు చేయగలుగుతున్నాం" అని తెలిపారు.ఇంకా ఆయన మాట్లాడుతూ, "ఏఐ ఎంటర్‌ప్రైజ్ వ్యూహంలో కీలక భాగంగా మారుతున్న నేపథ్యంలో, ఎన్విడియా సాంకేతికతలపై నిర్మితమైన పరిష్కారాలు పనితీరు, భద్రత, విస్తరణ సామర్థ్యాలను పెంచుతున్నాయి. దీని ద్వారా క్లయింట్లు మరింత ఆత్మవిశ్వాసంతో ఆవిష్కరణలు చేపడుతున్నారు" అని చెప్పారు.ఎన్విడియాతో తన భాగస్వామ్యం ద్వారా ఎల్టిఐమ్ వివిధ రంగాల సంస్థలకు బాధ్యతాయుతంగా, భారీ స్థాయిలో ఏఐ వినియోగాన్ని అమలు చేయడంలో సహకరిస్తూనే ఉందని సంస్థ వెల్లడించింది.

# మూసీ ప్రాజెక్టు తొలి దశ డీపీఆర్ రెడీ

- బఫర్‌జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్
- మంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం
- మంత్రి శ్రీధర్‌బాబు

ముద్ర, తెలంగాణ బ్యూరో:



మూసీ పునర్నిర్మాణ ప్రాజెక్టు డీపీఆర్ అంశంపై అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగింది. తొలి దశ డీపీఆర్ సిద్ధమైందని.. 1,435 నిర్మాణాలు ప్రభావితమవుతాయని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అయితే మెయిన్‌హార్ట్ సంస్థ సామర్థ్యంపై కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేస్తూ, గెజిట్ గణాంకాలకు మంత్రి మాటలకు పొంతన లేదని అన్నారు. దీంతో ప్రాజెక్టు పారదర్శకతపై సభలో వాదోపవాదాలు జరిగాయి.

మూసీ ప్రాజెక్టు తొలి దశ డీపీఆర్ తయారైందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. మూసీ పునర్నిర్మాణంలో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెప్పారు. తుది ఎన్యూమరేషన్ కొనసాగుతుందని.. బఫర్‌జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామన్నారు. 2013 చట్టం ప్రకారం భూసేకరణ, పునరావాసం ఉంటుందని అసెంబ్లీలో ప్రకటించారు. 'గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే... బఫర్‌జోన్ నిర్ణయించాం. మేం కొత్తగా బఫర్‌జోన్ నిర్ణయించలేదు. 2024 డిసెంబర్‌లో మెయిన్‌హార్ట్‌కు డీపీఆర్ బాధ్యతలు అప్పగించాం. 2026 ఫిబ్రవరిలో మెయిన్‌హార్ట్ సంస్థ డీపీఆర్ అప్పగించింది. కేటీఆర్ ఆరోపిస్తున్నట్లు మూసీ డీపీఆర్ రెండు నెలల్లో పూర్తి కాలేదు. వచ్చే ఏడీబీ బోర్డు మీటింగ్‌లో మూసీ ప్రాజెక్టుకు అనుమతి లభించే అవకాశం. బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ఆపేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. ప్రాజెక్టులను మేము నిలిపేసినట్లు బీఆర్ఎస్ ఆరోపించడం సరికాదు. ఎస్టీపీలకు సంబంధించి బీఆర్ఎస్ హయాంలో 30 శాతం పనులు పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న 70 శాతం పనులు మా హయాంలో పూర్తయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులు.. చిన్న వరదకే కొట్టుకుపోయాయి. మురికి కాలువగా ఉన్న జీవనది మూసీని అభివృద్ధి చేయడం తప్పా? మూసీ అభివృద్ధికి ఎందుకు అడ్డుపడుతున్నారు.' అని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు.

అంతకు ముందు మాట్లాడిన కేటీఆర్.. మూసీ డీపీఆర్ తయారుచేసేందుకే 18 నెలలు పడుతుందని చెప్పి... రెండు నెలల్లోనే పూర్తి చేశారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకవేళ డీపీఆర్ పూర్తయి ఉంటే.. మా ముందు పెట్టాలన్నారు. డీపీఆర్ మాకు ఇంతవరకు అందలేదని ఏడీబీ చెబుతుందని.. డీపీఆర్ తయారుకాకుండా తయారైందని చెప్పి తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైరయ్యారు. మూసీ డీపీఆర్ బాధ్యతలను మెయిన్‌హార్ట్‌కు అప్పగించారని.. మెయిన్‌హార్ట్ సంస్థపై పాకిస్థాన్ ప్రభుత్వం రెడ్‌కార్నర్ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. మూసీ పునర్నిర్మాణంలో 1400 నిర్మాణాలు పోతాయని మంత్రి చెబుతుంటే.. 10 వేల నిర్మాణాలు పోతాయని గెజిట్ చెబుతోందని అన్నారు. మంత్రి చెబుతున్నది కరెక్టా?... ప్రభుత్వ గెజిట్‌లో చెబుతున్నది కరెక్టా? అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కేటీఆర్ ప్రశ్నలకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు.

## ఆయిల్ ఫామ్ రైతులకు ఉగాది కానుక

- నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ
- ఈ నెల 22న 70లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ముద్ర, తెలంగాణ బ్యూరో :



ఉగాది కానుకగా రేపు సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ ఫ్యాక్టరీని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామని చెప్పారు. నర్మటలో 3 రోజుల పాటు వ్యవసాయ ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రదర్శనకు మంత్రులు, ప్రజా ప్రతినిధులందరి నీ ఆహ్వానించామని చెప్పారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు భరోసాపై కీలక ప్రకటన చేశారు. ఈనెల 22న రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేస్తారని వెల్లడించారు. 22న 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు జమ చేయబోతున్నామని తెలిపారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ రైతు సంక్షేమ కార్యక్రమాలు ఆగవద్దని సీఎం చెప్పినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వానికి రైతాంగమే ప్రాధాన్యత అని చెప్పారు. ఎన్నికల్లో రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు రుణమాఫీ చేస్తామని చెప్పినట్లు చేసి చూపించామన్నారు. మొక్క జొన్న కొనుగోళ్లపై ధర్నాలు చేయడం తేలికైన పని కానీ ధర్నాలు చేస్తున్నవారే కేంద్రంలో ఉన్నారని వారు కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లను బుధవారం నుంచి ప్రారంభించిందని చెప్పారు.

## సీఎస్ పదవీ కాలం పొడిగింపు

- మరో మూడు నెలలు కొనసాగిస్తూ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం నిర్ణయం
- కేంద్రం నుంచి రాష్ట్రానికి అందించిన సమాచారం

ముద్ర, తెలంగాణ బ్యూరో :



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై ఉత్కంఠకు తెరపడింది. ఆయన పదవీ కాలాన్ని మరో 3 నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర హోం శాఖ పరిధిలోని పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక సమాచారం అందింది. తాజా పరిణామాల నేపథ్యంలో జూన్ నెలాఖరు వరకు రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. కాగా గతేడాది ఆగస్టు 31న రామకృష్ణారావు పదవీ విరమణ చేయాల్సి ఉండగా.. ఆయన సర్వీసును పొడిగించాలని డీవోపీటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో 7 నెలలు ఆయన సర్వీసును పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు వెలువరించింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో ఆయన రామకృష్ణారావు సక్సెస్ అయ్యారు. యంత్రాగాన్ని గాడిలో పెట్టడం, తోటి సీనియర్‌ఐఏఎస్‌లతో కోఆర్డినేట్ చేసుకుంటూ పనిచేయడం, గత ప్రభుత్వ రుణాలను షెడ్యూల్ చేయించడంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే, మార్చి 31తో పదవీ కాలానికి సంబంధించి గడువు ముగుస్తుండటంతో మరోసారి ఎక్స్‌టెన్షన్ కోసం రాష్ట్రప్రభుత్వం డీవోపీటీకి లేఖ రాయగా సానుకూలంగా స్పందించింది. దీంతో మరో 3 నెలల పాటు రామకృష్ణారావు సీఎస్ పదవిలో ఉండనున్నారు.

### వినియోగదారుల భద్రత
## పరిరక్షణలో కొత్త ప్రమాణాలు

- కలెక్షన్ కాల్స్ కోసం ఏఐ మానిటరింగ్‌ని ఆవిష్కరించిన యాక్సిస్ ఫైనాన్స్

ముద్ర, ముంబై:




భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో (ఎన్‌బీఎఫ్‌సీ) ఒకటైన యాక్సిస్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఏఎఫ్ఎల్) పూర్తి స్థాయి ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను ఆవిష్కరించింది. సాధారణంగా రుణ జీవితకాలంలో కలెక్షన్ కాల్స్ అనేవి కీలకమైన కస్టమర్ టచ్‌పాయింట్‌గా ఉంటాయి. తాజా ఫ్రేమ్‌వర్క్ అమలుతో బాధ్యతాయుతమైన కలెక్షన్ విధానాలు, అంతర్గత గవర్నెన్స్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించబడతాయి. దీంతో ఈ ప్రక్రియ పరిమిత స్థాయిలో మాన్యువల్‌గా కాల్ శాంప్లింగ్ తీసుకోవడం నుంచి టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ వైపు పరివర్తన చెందినట్లవుతుంది. ఏఐ ఆధారిత ఫ్రేమ్‌వర్క్ కావడం వల్ల కస్టమర్లతో సంభాషణల విషయంలో మరింత లోతైన విశ్లేషణలు లభిస్తాయి. తగిన విధంగా చర్యలు తీసుకునేందుకు టీమ్ సభ్యులకు మార్గదర్శకత్వం లభిస్తుంది. విస్తృత స్థాయిలో కాల్స్‌ని కవర్ చేయడం ద్వారా యాక్సిస్ ఫైనాన్స్ కస్టమర్లతో సంభాషణల విషయంలో జవాబుదారీతనం, పర్యవేక్షణను మరింత పటిష్టపర్చింది. గవర్నెన్స్, నిబంధనలను పటిష్టంగా అమలు చేసే విధంగా ఈ ఫ్రేమ్‌వర్క్ రూపొందించబడింది. కలెక్షన్ ప్రక్రియ వ్యాప్తంగా వినియోగదారుల భద్రతను పరిరక్షించడం, వసూళ్ల విధానాలు బాధ్యతాయుతంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇవ్వబడింది. అవసరమైన సందర్భాల్లో సత్వర, సముచిత దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు ఈ విధానం తోడ్పడుతుంది.తరచుగా తలెత్తే కస్టమర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు, రీపేమెంట్ చర్చల్లో ఎదురయ్యే సవాళ్లను తగ్గించేందుకు ఈ సంభాషణల పర్యవేక్షణ ద్వారా తెలిసే విషయాలు తోడ్పడతాయి. అలాగే కస్టమర్లకు విశ్వసనీయమైన అనుభూతిని అందించగలవు. బాధ్యతాయుతమైన, పారదర్శకమైన విధానాలతో కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొనేందుకు ఏఐ ఆధారిత మానిటరింగ్ ఫ్రేమ్‌వర్క్ దీనికి నిదర్శనంగా నిలుస్తుంది. ప్రతి సంభాషణ సముచితంగా నిర్వహించబడేలా చూసుకునేందుకు తోడ్పడుతుంది. నిబంధనలకు అనుగుణంగా, కస్టమర్ల ప్రయోజనాలే పరమావధిగా కార్యకలాపాలను నిర్వహించడంపై తాము మరింతగా దృష్టి పెడుతుండటాన్ని ఇది సూచిస్తుందని యాక్సిస్ ఫైనాన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈవో సాయి గిరిధర్ తెలిపారు.



## రెయిన్ అలర్ట్...

- కామారెడ్డి, సిద్దిపేట, జనగాం జిల్లాలో వడగండ్ల వాన
- మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- ప్రకటించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

ముద్ర, తెలంగాణ బ్యూరో :

హైదరాబాద్ వాతావరణ కేంద్రం మరో అలర్ట్ జారీ చేసింది. ఆకాశంలో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని బుధవారం వెల్లడించింది. ముఖ్యంగా కామారెడ్డి, సిద్దిపేట, జనగాం జిల్లాలో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వేసవి తాపం కారణంగా ఏర్పడే క్యుములోనింబస్ మేఘాలతో ముఖ్యంగా సాయంత్రం సమయాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కాగా ఈ అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 3 నుండి 4 డిగ్రీల వరకు తగ్గి ఎండల నుంచి ఉపశమనం లభించనుంది. ఉరుములు మెరుపుల సమయంలో ప్రజలు చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల వద్ద ఉండవద్దని, రైతులు తమ పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై ఉండి, సాయంత్రం వేళల్లో చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

### ఫోర్ వీలర్ ఉన్నా ఇళ్లు ఇవ్వాలి: గుత్తా

ముద్ర, తెలంగాణ బ్యూరో:

ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నవారిని ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అనర్హులుగా ప్రకటించడం సరికాదని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. జీవనోపాధి కోసం లోన్లు తీసుకుని క్యాబ్‌లు, గూడ్స్ వాహనాలు నడిపే వారిలో కూడా ఇల్లు లేని వారు ఉన్నారని తెలిపారు. నిబంధనలు సవరించి రెండో విడతలో అయినా అలాంటి వారిని అర్హులుగా గుర్తించి ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన లబ్దిదారులకు అనుమతులు ఇవ్వాలని కూడా ఆయన కోరారు.



**దేవాలయ దర్శనం**
ఉగాది రోజున దేవాలయానికి వెళ్లి దేవుని దర్శించుకోవడం శుభఫలితాలను ఇస్తుంది. కుటుంబ సమేతంగా వెళ్లడం మంచిది.



## కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి

**ఆర్జెడి ఎం. సోమిరెడ్డి**
**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**
కేజీబీవీలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కీలక కేంద్రాలని రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్జేడీ) ఎం. సోమిరెడ్డి అన్నారు. ఈ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధన విధానం, ఉపాధ్యాయుల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస స్థాయి, అవగాహనను తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, వసతి పరిస్థితులను పరిశీలించి, ఆహారం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత ఎస్ఓ, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా అభివృద్ధి విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. కేజీబీవీలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. విద్యా సంస్థలకు చెడ్డపేరు రాకుండా సమన్వయంతో పని చేయాలని, వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి సంస్థ ప్రతిష్టను కాపాడాలని తెలిపారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేజీబీవీలో ఇటీవల జరిగిన పరిణామాలపై ఆయన సమగ్ర విచారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో శోభారాణి, కేజీబీవీ ఎస్‌వో సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ జ్యువెలర్స్ లో ఉగాది కానుకలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించే అగ్రశ్రేణి ఆభరణాల ఎంపికలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని కళ్యాణ్ జ్యువెలర్స్ ప్రకటించింది. సున్నితంగా రూపొందించిన ఆలయ స్ఫూర్తితో కూడిన నెక్లెస్‌లు, దివ్యమైన పెండెంట్ల నుండి సొగసైన గాజులు, పండుగ చెవిపోగుల వరకు, ప్రతి ఆభరణం సాంప్రదాయ హస్తకళను పండుగ వైభవాన్ని ప్రతిబింభిస్తుందని వెల్లడించింది. కొత్త సంవత్సరానికి స్టైల్‌గా స్వాగతం పలకడానికి ఇవి సరైనవనీ అభిప్రాయపడింది. దేశంలో అనేక ప్రాంతాలలో ఉగాది పండుగ నూతన సంవత్సరానికి నాంది పలుకుతుందని ఇది రాబోయే నెలలకు పునరుద్ధరణ, శ్రేయస్సు, ఆశకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ వేడుకల్లో ఆభరణాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంటుందన్న కళ్యాన్ జ్యువెలర్స్, ఇవి తరచుగా ఆశీర్వాదాలు, వారసత్వం, శాశ్వతమైన సొగసుకు ప్రతీకగా నిలుస్తాయని వెల్లడించింది. పండుగ పూజ సమయంలో ధరించినా, ప్రియమైన వారికి బహుమతిగా ఇచ్చినా, నూతన సంవత్సర ప్రారంభానికి గుర్తుగా జ్ఞాపికగా భద్రపరుచుకున్నా, ప్రతి ఆభరణం కేవలం అలంకరణకు మించిన అర్థాన్ని కలిగి ఉంటుందన్నారు. ఇలాంటి అన్ని రకాల ఆభరణాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.



## సాయి గార్డెన్‌లో ఇఫ్తార్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రళయ కాలమా..?

- అమెరికా 'డూమ్స్ డే' రంగంలోకి!
- యుద్ధ మేఘాల వేళ అగ్రరాజ్యం వ్యూహమేంటి?

**ముద్ర, డెస్క్:**




పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో 'డూమ్స్‌డే' మరోసారి ఆకాశంలో ప్రత్యక్షం కావడం ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని రేపుతోంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన అత్యంత శక్తిమంతమైన, రహస్య విమానాలుగా పేరుగాంచిన ఈ6బీ మెర్క్యూరీ, వీటినే సాధారణంగా 'డూమ్స్ డే' (ప్రళయ కాల) విమానాలు అని పిలుస్తారు. 'డూమ్స్ డే' విమానాలను అమెరికా రక్షణ శాఖ కేవలం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనే రంగంలోకి దింపుతుంది. ఒకవేళ భూమిపై ఉన్న అమెరికా సమాచార వ్యవస్థలు, సిగ్నలింగ్ వ్యవస్థలు అణ్వాయుధ దాడి వల్ల పూర్తిగా ధ్వంసమైతే, ఈ విమానాలు గాలిలోనే ఉండి దేశ సైనిక కార్యకలాపాలను సమన్వయం చేస్తాయి. అంటే భూమిపై కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయని పక్షంలో, ఇవి ఒక 'ఫ్లయింగ్ కమాండ్ సెంటర్'గా పనిచేస్తూ అమెరికా అధ్యక్షుడికి, రక్షణ శాఖకు మధ్య వారధిగా నిలుస్తాయి. ఈ సమయంలో ఈ విమానాలను మోహరించడం అంటే, అమెరికా ఏదో ఒక పెద్ద ముప్పును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందనే సంకేతాలను ఇస్తోంది. సుమారు 150 అడుగుల పొడవు ఉండే ఈ విమానాలు భూమికి 40 వేల అడుగుల ఎత్తు వరకు ప్రయాణించగలవు. ఈ విమానం యొక్క అత్యంత అద్భుతమైన ఫీచర్ ఏమిటంటే, ఇది ఆకాశంలో ఉండగానే ఇంధనాన్ని నింపుకోగలదు. దీనివల్ల ఇవి నిరంతరాయంగా 7 వేల మైళ్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అణు యుద్ధం సంభవించినా కూడా ఇవి సురక్షితంగా ఉండేలా రేడియేషన్ నిరోధక కవచంతో వీటిని రూపొందించారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో సముద్ర గర్భంలో అమెరికా రహస్యంగా ఉంచిన అణ్వాయుధ క్షిపణులను కూడా ఈ విమానం నుంచి రిమోట్ ద్వారా ప్రయోగించే సాంకేతికత దీని సొంతం. ఈ విమానాలు కేవలం నిఘా కోసం మాత్రమే కాకుండా, శత్రు దేశాలకు హెచ్చరికలు పంపడానికి కూడా ఉపయోగపడతాయి. పశ్చిమాసియాలోని ప్రస్తుత అస్థిరత నేపథ్యంలో అమెరికా తన అమ్ములపొదిలోని ఈ బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీయడం వెనుక బలమైన వ్యూహం ఉందని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏ క్షణంలోనైనా అణుదాడులు జరిగే అవకాశం ఉందనే భయంతో పాటు, తన మిత్రదేశాలకు అండగా ఉంటామనే భరోసా ఇచ్చేందుకు అమెరికా ఈ చర్యకు పూనుకుంది. సాధారణంగా ఇవి బయట ఎవరికీ కనిపించవు, కానీ ఇప్పుడు పబ్లిక్ ట్రాకర్లలో లేదా ఆకాశంలో కనిపిస్తున్నాయంటే, అది ప్రత్యర్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే యుద్ధతంత్రంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దేశ పారిశ్రామికాభివృద్ధికి 'భవ్య' బాట

- 100 నగరాలు, 100 క్లస్టర్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- ప్రత్తికి మద్దతు ధర, భవ్య పథకం తోపాటు ఎఫ్‌సీఆర్‌ఎ బిల్లుకు ఆమోదం
- మోదీ మంత్రివర్గం కీలక నిర్ణయాలు

**ముద్ర, డెస్క్:**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చేందుకు 'భారత్ పారిశ్రామిక అభివృద్ధి పథకం (భవ్య)'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక క్లస్టర్లు, 100 పెద్ద పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయనున్నారు. ప్లగ్ అండ్ ప్లే విధానంలో రోడ్లు, విద్యుత్, నీటి వంటి మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయబడతాయి. ఈ పథకం అమలుకు రూ.33,660 కోట్లను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశీయ ఉత్పత్తిని పెంచి 'మేక్ ఇన్ ఇండియా'ను మరింత విస్తరించడం దీని లక్ష్యమన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు.

**ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుకు ఆమోదం**
ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. మరోవైపు 2023-24 పత్తి సీజన్‌లో కనీస మద్దతు ధర (MSP) కార్యకలాపాలపై ఖర్చు చేసిన రూ.1,718 కోట్లను రీయింబర్స్ చేయడానికి ఆమోదం లభించింది. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లో బారాబంకి-బహ్రాయిచ్ మధ్య 101.5 కిలోమీటర్ల నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారి 927 నిర్మాణానికి రూ.6,969.04 కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్యూలు, ప్రైవేట్ డెవలపర్ల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# నివాసం ఉండకపోతే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు రద్దు

- తిరిగి అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తాం
- మార్చి 31లోపు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి
- హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి
- హౌసింగ్, రెవెన్యూ, సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**



ప్రభుత్వ పథకాల కింద ఇండ్లు పొందిన లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండ నివసించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. కేటాయించిన ఇళ్లల్లో నివాసం ఉండని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాలని ఆదేశించారు. తుది గడువు మార్చి 31లోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీల సహాయంతో ఎంపిక చేసిన లిస్ట్ ను జిల్లా మంత్రి గారి ఆమోదం తీసుకొని గజిటెడ్ ఆఫీసర్ ద్వారా ధృవీకరణ చేసి మంజూరు చేస్తారని కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండని లబ్ధిదారులందరు ఈ నెల 31వ తేదీ వరకు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పనిసరిగా నివసించాలని ఆదేశించారు. ఇళ్ల లో నివాసానికి ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. లేని యెడల ఏప్రిల్ మొదటి వారంలో వారికి కేటాయించిన ఇండ్లను రద్దు చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

**హౌసింగ్ కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి**
జిల్లాలోని అన్నీ ప్రభుత్వ హౌసింగ్ కాలనీలలో అవసరమైన మౌలిక సదుపాయాలైన విద్యుత్ సరఫరా, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. పరిశుద్ధ్యం పనులు చేపట్టాలని సంబంధిత మెట్రో వాటర్ వర్క్స్, మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు వచ్చిన ఎల్2 లిస్ట్ దరఖాస్తుదారులు ఇంకా మిగిలి ఉంటే దగ్గరలో ఉన్న ఎకరం కంటే ఎక్కువ ఉన్న స్థలాలను గుర్తించి మంజురి నిమిత్తం ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా డబల్ బెడ్ రూమ్ ల కాలనీలలో ఉన్న దుకాణాలను వేలం వేయాలని సూచించారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆయా హౌసింగ్ కాలనీల అభివృద్ధి నిమిత్తం ఉపయోగించడం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులందరూ నిర్లక్ష్య ధోరణి అవలంభించకుండా పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత, పార్థసింహ రెడ్డి, తహసీల్దార్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు పోకిరీలను పట్టుకున్న షీటీమ్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూలు**

జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో అమ్మాయిలను వేధిస్తున్న ముగ్గురు పోకిరీలను షి టీమ్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆడపిల్లలను వేధించే వారిపై కఠిన చర్యలు తప్పవని షి టీమ్ ఎస్ఐ రజిత హెచ్చరించారు. మహిళల పట్ల ఏ విధమైన వేధింపులు జరిగినా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏఎస్ఐ రాజ్యలక్ష్మి, కానిస్టేబుల్ వెంకటేష్ పాల్గొన్నారు.



## ప్యూరిఫైయర్ అందజేత


**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**
నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ జ్ఞానేశ్వర వాత్సల్య అరక్షిత బాలికల మందిరానికి రూ.35 వేల విలువ గల నీటి ప్యూరిఫైయర్‌ను లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ ప్యూరిఫైయర్‌ను 320A లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు హకీమ్ విశ్వ ప్రసాద్, రాధాకృష్ణ, నరేందర్ రెడ్డి, సురేష్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, ఆశ్రమ మహిళ వార్డెన్ కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోహిత్ రెడ్డి ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్ర

**పోలీసు కేసులపై బీఆర్ఎస్ నేతల సంచలన వ్యాఖ్యలు**
ముద్ర,తాండూరు: వికారాబాద్ జిల్లా తాండూరు టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, పట్లోళ్ల నర్సింలు మరియు ఇతర కీలక నేతలు పాల్గొని ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.

**కేసు నమోదుపై అనుమానాలు:**
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 15న జరిగినట్లు చెబుతున్న డ్రగ్స్ కేసులో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఘటన 15వ తేదీన జరిగితే, దానికి సంబంధించి 14వ తేదీనే ఎఫ్ఐఆర్ (FIR) ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. కేవలం రాజకీయ కక్షతోనే డ్రగ్స్ మరియు తుపాకుల కాల్పుల సెక్షన్లను మార్చి రోహిత్ రెడ్డిని ఈ కేసులో ఇరికించారని వారు మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, సీనియర్ నాయకులు పట్లోళ్ల నరసింహులు, సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, సలీం బాయ్, పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం
ఉగాది నాడు పెద్దలకు నమస్కరించి వారి ఆశీర్వాదం తీసుకోవడం మంచి సంప్రదాయం. ఇది మనకు శుభం మరియు విజయాన్ని ఇస్తుంది.

## కుమారుడితో హైదరాబాద్‌కు సానియా మీర్జా

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
మధ్యప్రాచ్యంలోని యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో దుబాయ్‌లో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత మాజీ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా తన కుమారుడు ఇజాన్‌తో కలిసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ ఎదురైన భయానక పరిస్థితులను ఆమె వెల్లడించారు.

**ఇంటి సమీపంలో క్షిపణి శకలాలు**
దుబాయ్‌లో పరిస్థితులపై స్పందిస్తూ సానియా.. ఇంటి పైనుంచి ఫైటర్ జెట్లు వెళ్లడం, గాల్లోనే అడ్డుకునే శబ్దాలు వినిపించడం భయాన్ని కలిగించిందని తెలిపారు. తమ ఇంటికి సమీపంలోనే క్షిపణి శకలాలు పడటం చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యానని చెప్పారు.

**కుమారుడి ప్రశ్నలతో ఆందోళన**
యుద్ధ వాతావరణం పిల్లలపై ప్రభావం చూపుతుందని సానియా పేర్కొన్నారు. తన కుమారుడు పరిస్థితులపై ప్రశ్నలు అడగడం మొదలుపెట్టాడని తెలిపారు. అక్కడ పరిస్థితులు పూర్తిగా అసురక్షితంగా లేకపోయినా, అనిశ్చితి పెరగడంతో హైదరాబాద్‌కు రావాలని నిర్ణయించుకున్నానని చెప్పారు.

**రంజాన్ కోసం స్వస్థలానికి రాక**
ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో పండుగను కుటుంబంతో కలిసి గడపడానికి హైదరాబాద్‌కు వచ్చినట్లు సానియా వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడితేనే తిరిగి దుబాయ్ వెళ్లే అంశంపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు.

## క్యాండిడేట్స్ టోర్నీకి హంపి దూరం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు క్రీడలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కీలక నిర్ణయం తీసుకున్నారు. సైప్రస్‌లోని పెజియాలో మార్చి 28 నుంచి జరగాల్సిన వుమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు తాను హాజరుకావడం లేదని ప్రకటించారు.

***భద్రతపై ఆందోళనతో నిర్ణయం***
ప్రస్తుతం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో భద్రతాపరమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ చర్యలకు ప్రతిగా ఇరాన్ నిర్వహించిన డ్రోన్ దాడులు పరిసర దేశాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సైప్రస్‌లో భద్రతా పరిస్థితులు అనిశ్చితంగా మారాయని భావించిన హంపి టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయించారు. సైప్రస్ లెబనాన్‌కు సమీపంలో ఉండటం, ఇటీవల జరిగిన డ్రోన్ దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోటీల కంటే భద్రత ముఖ్యమని భావించిన హంపి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది.





# ఐపీఎల్ 2026 రివ్యూ : ఆర్సీబీ
# మరోసారి భళా అనిపిస్తుందా?

**డిఫెండింగ్ ఛాంపియన్‌గా బెంగళూరు బరిలో... బలాలు, బలహీనతలు ఇవే!**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ చరిత్రలో అత్యధిక అభిమాన గణాన్ని సంపాదించిన జట్టుగా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)... ఎన్నో సంవత్సరాల నిరాశ తర్వాత 2025 సీజన్‌లో చరిత్ర సృష్టించింది. ఫైనల్లో పంజాబ్‌ను ఓడించి తొలిసారి ట్రోఫీని అందుకున్న ఆర్సీబీ... ఇప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో కొత్త సీజన్‌కు సిద్ధమైంది. ఈసారి కూడా అదే జోరు కొనసాగిస్తుందా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

**బలంగా కనిపిస్తున్న జట్టు**
ఈ సీజన్‌లో ఆర్సీబీ జట్టు మరింత సమతుల్యంగా కనిపిస్తోంది. గతంలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ... బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమర్థవంతమైన ఆటగాళ్లను తీసుకుంది. టీమ్ డేవిడ్, రోమారియో షెఫర్డ్, జాకబ్ బెతల్ వంటి పవర్ హిట్టర్లు జట్టుకు అదనపు బలం. అదే సమయంలో వెంకటేష్ అయ్యర్, కృనాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్ లాంటి ఆల్‌రౌండర్లు బ్యాట్, బంతితో మ్యాచ్‌ను మలుపుతిప్పే సామర్థ్యం కలిగివున్నారు.

**కోహ్లీపై మళ్లీ ఆశలు**
ఆర్సీబీ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది విరాట్ కోహ్లీ. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ తనదైన ముద్ర వేశాడు. 8,661 పరుగులు, 8 సెంచరీలు, 63 హాఫ్ సెంచరీలతో రికార్డులు సృష్టించిన అతడు... ఈసారి కూడా జట్టుకు ప్రధాన బలంగా నిలవనున్నాడు. గత సీజన్ విజయాన్ని మళ్లీ పునరావృతం చేయాలనే పట్టుదలతో కోహ్లీ కనిపిస్తున్నాడు.

**బ్యాటింగ్ విభాగం – భారీ ఆయుధం**
ఆర్సీబీకి ప్రధాన బలం బ్యాటింగ్. టాప్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు హిట్టర్లతో నిండిన ఈ జట్టు... ఏ బౌలింగ్ దాడినైనా తుడిచిపెట్టగలదు. ముఖ్యంగా బెతల్, షెఫర్డ్, అయ్యర్ వంటి ఆటగాళ్లు వేగంగా పరుగులు చేయగల సామర్థ్యం కలిగి ఉండడం జట్టుకు పెద్ద ప్లస్.

బౌలింగ్ - ఆశలు, అనుమానాలు
భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ లాంటి అనుభవజ్ఞులైన బౌలర్లు జట్టులో ఉండటం బలం. యష్ దయాల్, సుయాష్ శర్మ వంటి యువ ఆటగాళ్లు కూడా మంచి ప్రదర్శన ఇస్తున్నారు. అయితే హేజిల్‌వుడ్ గాయాల నుంచి పూర్తిగా కోలుకున్నాడా? భారత పిచ్‌లపై అతడు అదే స్థాయిలో ప్రభావం చూపగలడా? అన్న సందేహాలు ఉన్నాయి. గతంలో కీలక సమయాల్లో బౌలర్లు పరుగులు ఇవ్వడం ఆర్సీబీకి పెద్ద సమస్యగా మారింది.

**బలహీనతలు**
కీలక మ్యాచ్‌లలో బౌలింగ్ ఒత్తిడిని తట్టుకోలేకపోవడం
టాప్ ఆర్డర్ విఫలమైతే మిడిల్ ఆర్డర్‌పై అధిక భారం

**హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్ అనిశ్చితి**
గత సీజన్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ అద్భుత ప్రదర్శన చేసి ట్రోఫీ గెలిచిన ఆర్సీబీ... ఈసారి కూడా అదే స్థాయిలో ఆడితే మరోసారి ఛాంపియన్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయి. అయితే బౌలింగ్‌లో స్థిరత్వం, కీలక ఆటగాళ్ల ఫామ్ కీలకం. మొత్తంగా... "ఈసారి కూడా కప్ మనదే" అన్న నినాదం నిజమవుతుందా లేదా అనేది మైదానంలోనే తేలాలి!

## సన్‌రైజర్స్ కెప్టెన్ల చరిత్ర తెలుసుకోవాల్సిందే

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రారంభం నుంచి ఇప్పటివరకు పలువురు ఆటగాళ్లు కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించారు. 2013లో జట్టు అరంగేట్రం చేసినప్పటి నుంచి నాయకత్వంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. తొలి సీజన్‌లో కుమార సంగక్కర, క్యామెరన్ వైట్ జట్టును నడిపించారు. అనంతరం శిఖర్ ధవన్ 2013-14 మధ్య కెప్టెన్‌గా కొనసాగాడు. 2014లో డ్యారెన్ స్యామీ కూడా కొద్ది మ్యాచ్‌లకు నాయకత్వం వహించాడు.



2015 నుంచి డేవిడ్ వార్నర్ కెప్టెన్సీ చేపట్టి జట్టుకు కొత్త దిశ చూపించాడు. 2016లో సన్‌రైజర్స్‌కు టైటిల్ అందించి విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచాడు. అతను 2021 వరకు జట్టును నడిపించాడు. 2018 నుంచి కేన్ విలియమ్సన్ కూడా కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో భువనేశ్వర్ కుమార్ కొన్ని మ్యాచ్‌లకు నాయకత్వం వహించాడు. 2021లో మనీష్ పాండే ఒక మ్యాచ్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు. 2023లో ఎయిడెన్ మార్క్రం జట్టును నడిపించగా, 2024 నుంచి ప్యాట్ కమిన్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇప్పుడు 2026 సీజన్‌లో గాయం కారణంగా కమిన్స్ దూరం కావడంతో ఇషాన్ కిషన్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇలా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇప్పటివరకు పలువురు కెప్టెన్లను చూసి ముందుకు సాగుతోంది.

# అభిషేక్ సక్సెస్ వెనుక త్రిమూర్తులు

**మూడు డకౌట్ల నుంచి వరల్డ్ కప్ హీరో దాకా తీర్చిదిద్దింది వారే**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజయంలో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్‌లో మెరుపు అర్ధశతకంతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. టోర్నీ ఆరంభంలో ఎదురైన వైఫల్యాల నుంచి తిరిగి నిలబడడంలో ముగ్గురు వ్యక్తుల మద్దతు కీలకమని అభిషేక్ వెల్లడించాడు.



**ఆరంభంలో వరుస డకౌట్లు**
టోర్నీకి ముందు మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, ప్రారంభ మ్యాచ్‌ల్లో అభిషేక్ శర్మ వరుసగా మూడు డకౌట్లు అయ్యాడు. దీంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 18 బంతుల్లో 52 పరుగులు చేసి తన ప్రతిభను చాటాడు.

**గంభీర్, సూర్యకుమార్, యువరాజ్ అండ**
తనపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన వారిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, మెంటర్ యువరాజ్ సింగ్ ఉన్నారని అభిషేక్ తెలిపాడు. గంభీర్ జట్టు నుంచి పూర్తి మద్దతు అందించారని పేర్కొన్నాడు. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ల తర్వాత కూడా సహజ ఆట ఆడమని సూచించాడని చెప్పాడు. యువరాజ్ సింగ్ తరచూ మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని పెంచాడని వివరించాడు.

**ప్రపంచకప్ ఇచ్చిన పాఠం**
ఈ టోర్నీ తనకు మానసిక దృఢత్వం ఎంత అవసరమో నేర్పిందని అభిషేక్ పేర్కొన్నాడు. మంచి ప్రదర్శనతో అతిగా ఉత్సాహపడకుండా, వైఫల్యాల సమయంలో నిరాశ చెందకుండా సమతుల్యంగా ఉండటమే ముఖ్యమని తెలిపాడు. ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయం అందించిన అభిషేక్ శర్మ ప్రస్తుతం టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మనదే ఆధిపత్యం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టాప్ 5లో ముగ్గురు భారత ఆటగాళ్లు స్థానం దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా, రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచాడు. టాప్5లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉండటం జట్టు బలాన్ని సూచిస్తోంది.

**బౌలింగ్, ఆల్‌రౌండర్లలో ఆఫ్ఘన్ జోరు**
బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మొదటి స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తదుపరి స్థానాల్లో నిలిచారు. నమీబియా ఆటగాడు బెర్నార్డ్ స్కోల్ట్జ్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో అజ్మతుల్లా ఒమర్జాయ్ అగ్రస్థానంలో ఉండగా, సికందర్ రజా, మహ్మద్ నబీ టాప్3లో నిలిచారు.





## సన్‌రైజర్స్‌కు కొత్త సారథి

- **ఇషాన్ కిషన్ ఎంపిక!**
- **ఇన్నాళ్లకు ఓనర్ కావ్య మంచి నిర్ణయం తీసుకుంది!**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను యాజమాన్యం నియమించింది. ప్యాట్ కమిన్స్ వెన్ను గాయం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట అభిషేక్ శర్మకు సారథ్యం ఇస్తారని ప్రచారం జరిగినప్పటికీ, చివరకు కిషన్‌కే బాధ్యతలు అప్పగించారు. అభిషేక్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఇటీవల డొమెస్టిక్ క్రికెట్‌లో జార్ఖండ్ జట్టును విజేతగా నిలిపిన కిషన్ నాయకత్వంపై మేనేజ్మెంట్ విశ్వాసం వ్యక్తం చేసింది. కమిన్స్ కోలుకున్న తర్వాత తిరిగి కెప్టెన్సీ చేపడతాడని ప్రకటించినా, ఈ సీజన్ మొత్తానికి కిషన్ సారథిగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నిర్ణయంపై అభిమానులు సోషల్ మీడియాలో సానుకూలంగా స్పందిస్తూ, కావ్య మారన్ సరైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసిస్తున్నారు.



## ఖరీదైన ప్లేయర్ గ్రీన్‌కు వచ్చేదెంత?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 వేలంలో రూ.25.20 కోట్ల భారీ ధరకు అమ్ముడైన ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ చర్చనీయాంశంగా మారాడు. అయితే వేలంలో వచ్చిన మొత్తం మొత్తం అతనికి నేరుగా దక్కదు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం జట్టు చెల్లించే మొత్తంలో నుంచి పన్నులు, ఇతర కట్టుబాట్లు మినహాయిస్తారు. ముఖ్యంగా విదేశీ ఆటగాళ్లకు భారతదేశంలో ఆదాయ పన్ను వర్తిస్తుంది. సాధారణంగా ఈ పన్ను సుమారు 30 నుంచి 40 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. దీంతో రూ.25.20 కోట్లలో గ్రీన్‌కు చేతికి వచ్చే మొత్తం సుమారు రూ.15 నుంచి 17 కోట్ల మధ్య ఉండే అవకాశముంది. మిగిలిన మొత్తం పన్నులు, ఇతర చెల్లింపుల రూపంలో తగ్గుతుంది. అయినా భారీ ధరతో గ్రీన్ ఐపీఎల్ వేలంలో టాప్ ఆకర్షణగా నిలిచాడు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**దానధర్మాలు చేయడం**


ఉగాది నాడు పేదలకు అన్నం, బట్టలు లేదా డబ్బు దానం చేయడం పుణ్యకార్యం. ఇది మనసుకు సంతృప్తిని ఇస్తుంది.




## 'ధురంధర్2' తెలుగు ప్రీమియర్లు రద్దు

బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన 'ధురంధర్: ది రివెంజ్' చిత్రానికి సంబంధించిన తెలుగు ప్రీమియర్ షోలు రద్దయ్యాయి. కంటెంట్ అందించడంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా మార్చి 18న జరగాల్సిన అన్ని చెల్లింపు ప్రీమియర్ ప్రదర్శనలను నిలిపివేశారు. ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వేదికల నుంచి ఈ షోలను తొలగించగా, టికెట్లు కొనుగోలు చేసిన వారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సమస్య ప్రభావం తెలుగు సహా ఇతర ప్రాంతీయ భాషల ప్రీమియర్లపైనే పడింది. అయితే హిందీ వెర్షన్‌కు సంబంధించిన కంటెంట్ అందుబాటులో ఉండటంతో కొన్ని ప్రధాన మల్టీప్లెక్స్‌లలో హిందీ ప్రదర్శనలు యథావిధిగా కొనసాగనున్నాయి. సుమారు 3 గంటల 49 నిమిషాల నిడివి కలిగిన ఈ చిత్రం రేపటి నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో ప్రణాళిక ప్రకారం విడుదల కానుంది. ప్రీమియర్ ప్రదర్శనలు రద్దు కావడంతో నిరాశ చెందిన ప్రేక్షకులు తమ డబ్బుల తిరిగి చెల్లింపుల వివరాల కోసం సంబంధిత యాప్‌లు లేదా థియేటర్ యాజమాన్యాన్ని సంప్రదించాలని చిత్రబృందం సూచించింది.



## 'మేడ్ ఇన్ కొరియా' ఎఫెక్ట్..


**నాగార్జున 100వ సినిమాపై సందేహాలు**

టాలీవుడ్‌లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం విడుదల తర్వాత మిక్స్‌డ్ స్పందన తెచ్చుకుంది. ఈ ఫలితంతో దర్శకుడు రా కార్తిక్ పేరు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాలో భావోద్వేగాలు ఉన్నప్పటికీ అవి ప్రేక్షకులకు పూర్తిగా కనెక్ట్ కాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కథలోని ఎమోషన్స్‌ను బలంగా చూపించడంలో లోపాలు ఉన్నాయని, కొన్ని సన్నివేశాలు సహజత్వానికి దూరంగా ఉన్నాయని విమర్శలు వినిపించాయి. ఇదే సమయంలో రా కార్తిక్ దర్శకత్వంలో నాగార్జున 100వ సినిమా తెరకెక్కనుండటం ఆసక్తికరంగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నప్పటికీ, 'మేడ్ ఇన్ కొరియా' ఫలితం తర్వాత అభిమానుల్లో కొంత సందేహం నెలకొంది. అయితే మరోవైపు దర్శకుడి టాలెంట్‌పై నమ్మకం వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు. సరైన కథ, బలమైన స్క్రీన్‌ప్లేతో వస్తే నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తంగా 'మేడ్ ఇన్ కొరియా' మిక్స్‌డ్ ఫలితం రా కార్తిక్‌కు పరీక్షగా మారగా, నాగార్జున 100వ సినిమాపై ఆసక్తితో పాటు అనుమానాలు కూడా పెంచింది.



## ఎల్పీజీ కొరతపై అక్షయ్ స్పందన.. ప్రభుత్వ భరోసా

పశ్చిమ ఆసియా పరిస్థితుల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ స్పందించారు. గ్యాస్ కొరతకు ముందస్తు జాగ్రత్తగా తన భార్య ట్వింకిల్ ఖన్నా ఇండక్షన్ స్టవ్‌లు ఆర్డర్ చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ప్రత్యామ్నాయాలను ఆలోచించడం మంచిదని సూచించారు. ఇక ప్రభుత్వం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. ఎల్పీజీ కొరతపై ఆందోళన అవసరం లేదని, దేశీయ ఉత్పత్తిని పెంచడంతో పాటు బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.





## రెడ్ స్టైల్‌లో మెరిసిన రోస్ సర్దానా

చండీగఢ్‌కు చెందిన రోస్ సర్దానా తన అందం, స్టైల్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలో ఆమె కనిపిస్తున్న తీరు ప్రత్యేకంగా ఆకర్షణీయంగా ఉంది. ఈ చిత్రంలో ఎరుపు రంగు స్టైలిష్ దుస్తుల్లో రోస్ ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తోంది. సాధారణమైన మేకప్, సహజమైన జుట్టు శైలి ఆమె అందాన్ని మరింత మెరుగుపరుస్తున్నాయి. ముఖంలో కనిపించే నిశ్శబ్దమైన భావం, కళ్లలోని సున్నితమైన భావ వ్యక్తీకరణ ఆమెకు ప్రత్యేకమైన శోభను ఇస్తున్నాయి. లైట్ బ్రౌన్ రంగు షర్ట్‌ను సడలుగా వేసుకుని, కేజువల్ స్టైల్‌లో కూర్చున్న పోజ్ చాలా సహజంగా ఉంది. ఆమె స్టైల్‌లో ఎక్కడా అతిశయోక్తి లేకుండా, సరళతతో కూడిన క్లాస్, ఎలిగెన్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఫోటోలో రోస్ సర్దానా అందం కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఆత్మవిశ్వాసం మరియు సౌందర్యం కలయికగా మెరిసుతోంది. అందుకే ఆమె ప్రతి ఫోటో కూడా సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అవుతోంది. ప్రస్తుతం నటిగా, యాంకర్‌గా బిజీగా ఉన్న రోస్, ఇటువంటి ఫోటో షూట్‌లతో తన అభిమానులను ఎప్పటికప్పుడు అలరిస్తూనే ఉంది.

## అందంతో మెస్మరైజ్ చేస్తున్న రితాభరి చక్రవర్తి

ఈ అద్భుతమైన ఫోటోలో రితాబరి చక్రవర్తి బంగారు రంగు దుస్తుల్లో తన గ్లామర్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మెరుస్తున్న గోల్డెన్ దుస్తులు ఆమెకు ప్రత్యేకమైన రాజసమైన లుక్‌ను అందిస్తున్నాయి. ఈ చిత్రంలో ఆమె ధరించిన మడతలతో ఉన్న గౌన్ గాలిలో తేలియాడుతూ ఎంతో సొగసుగా కనిపిస్తోంది. సాదాసీదా మేకప్, స్టైలిష్ జుట్టు శైలి, ధరించిన బంగారు ఆభరణాలు ఆమె అందాన్ని మరింత మెరుగుపరుస్తున్నాయి. ముఖంలో కనిపించే ఆత్మవిశ్వాసం, కళ్లలోని గంభీరమైన భావ వ్యక్తీకరణ ఆమె లుక్‌కు మరింత శోభను తీసుకువస్తున్నాయి. ప్రత్యేకంగా ఈ ఫోటోలో కనిపించే ప్రతిబింబం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. నేలపై ఆమె ప్రతిబింబం కనిపించడం వల్ల ఈ చిత్రం మరింత కళాత్మకంగా మారింది. అది ఆమె అందాన్ని మరో కోణంలో చూపిస్తూ ప్రత్యేకతను తెచ్చింది. సొగసుతో పాటు ధైర్యాన్ని ప్రతిబింబించే ఈ లుక్‌లో రితాభరి అందం కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, శక్తివంతమైన వ్యక్తిత్వాన్ని కూడా స్పష్టంగా చూపిస్తోంది. ఈ ఫోటో చూసిన ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా



## బీచ్‌పై మెరిసిన శాన్వి అందం.. గ్లామర్‌కు కొత్త నిర్వచనం

సముద్ర తీరంలో నిలిచిన ఈ ఫోటోలో శాన్వి శ్రీవాస్తవ తన అద్భుతమైన లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నీలి ఆకాశం, ప్రశాంతమైన సముద్రం మధ్య ఆమె అందం మరింత మెరిసిపోతుంది. ఈ చిత్రంలో చిరుత పులి మచ్చల మాదిరి డిజైన్ ఉన్న స్టైలిష్ దుస్తులతో పాటు గీతల డిజైన్ ఉన్న స్కర్ట్‌ను ధరించిన శాన్వి ఎంతో ఫ్యాషన్‌గా కనిపిస్తోంది. కళ్లద్దాలు, సాదాసీదా జుట్టు శైలి ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఆమె నిలబడిన తీరు, పోజ్‌లో కనిపించే ధైర్యం ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. బీచ్ వాతావరణానికి తగ్గట్టుగా ఆమె స్టైల్ చాలా సహజంగా, ట్రెండీగా ఉంది. ఎక్కడా అతిశయోక్తి లేకుండా, సొగసుతో పాటు ఆధునికత కలగలిపిన ఈ లుక్ అభిమానులను కట్టిపడేస్తోంది. ఈ ఫోటోలో శాన్వి అందం కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఆమె ఆత్మవిశ్వాసాన్ని కూడా ప్రతిబింబిస్తోంది. అందుకే ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి.

## ఉస్తాద్ ఫలితం చిరుతో మూవీని తేల్చేస్తుందా?



'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ఫలితం దర్శకుడు హరీష్ శంకర్‌కు కీలకంగా మారింది. ఈ సినిమా భారీ విజయం సాధిస్తే, చిరంజీవితో ఆయనకు సినిమా చేసే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం చిరంజీవి కథల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా ముందుకు వెళ్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా రిస్క్ తీసుకోవడం తగ్గించి, నిరూపితమైన దర్శకులతోనే పని చేయాలనే దృక్పథంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో హరీష్ శంకర్‌కు 'ఉస్తాద్' విజయం చాలా ముఖ్యంగా మారింది. హరీష్ శంకర్ మాస్ ఎంటర్‌టైనర్‌లలో తన ప్రతిభను ఇప్పటికే చూపించినప్పటికీ, తాజా విజయం ద్వారా మరింత నమ్మకం సంపాదించాల్సిన అవసరం ఉంది. ఒకవేళ 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితం సాధిస్తే, చిరుహరీష్ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. లేదంటే ఈ ప్రాజెక్ట్ మరికొంత కాలం వాయిదా పడే అవకాశం ఉంది.

## వివాదాస్పద వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పిన పార్తిబన్



'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలతో తమిళ నటుడు రాధాకృష్ణన్ పార్తిబన్ వివాదంలో నిలిచారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తనను పరిచయం చేసుకుంటూ కులాన్ని ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అంశంపై స్పందించిన పార్తిబన్, తాను ఎలాంటి దురుద్దేశంతో మాట్లాడలేదని, అనుకోకుండా నోరు జారిందని తెలిపారు. తాను కులవ్యవస్థకు వ్యతిరేకినని స్పష్టం చేస్తూ, తన మాటల వల్ల ఎవరి మనసైనా నొచ్చి ఉంటే క్షమించాలని కోరారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తగా ఉంటానని చెప్పారు.పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఈ చిత్రం ఉగాది సందర్భంగా మార్చి 19న విడుదల కానుంది. సినిమా విడుదలకు ముందే ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

# సాహితి సోపానం

## నవ వసంత నాదం పరాభవ ఉగాది ప్రమోదం!!

మామిడి చివుళ్లపై
కోయిలమ్మ కుహూరాగం...
వేప పూత గుబాళింపుతో
ప్రకృతి పరవశం!
చైత్ర మాసపు తొలి కిరణం తెచ్చింది
శుభ సంకేతం...
అదే మన తెలుగు లోగిళ్లలో
పరాభవ నామ సంవత్సర ఆరంభం!
తీపి, వొగరు, చేదుల కలయిక
ఈ జీవన సారం...
షడ్రుచుల ఉగాది పచ్చడి పంచేను
గొప్ప సందేశం!
కష్టసుఖాల కలయికే ఈ సృష్టికి
మూలాధారం...
అందరిలో నింపాలి ఈ పండుగ
నూతన ఉత్సాహం!
పాత చేదు జ్ఞాపకాలను విస్మరిద్దాం...
కొత్త ఆశల చివుళ్లతో ప్రయాణం
సాగిద్దాం!
పంచాంగ శ్రవణంతో కాలగమనాన్ని
తెలుసుకుందాం...
ధర్మ మార్గంలో పయనిస్తూ విజయాలను
అందుకుందాం!
ప్రకృతి ఒడిలో పుట్టిన
ఈ పచ్చని పండుగ...
తెలుగు వారి గుండెల్లో
నిండాలి సంప్రదాయపు
వెలుగుగ!
పకృతిని పులకరించే పండుగగా
పరిమళించే ఉగాది
అందరి నాలుకలపై షడ్రుచుల రుచి
చూపించేను ఉగాది!!
చిగురించిన మామిడి కొమ్మపై
కోయిల కూతలు
వసంత లక్ష్మికి పలుకుతున్న
స్వాగత గీతాలు
పచ్చని తోరణాల పందిరి కింద
ముంగిట ముగ్గులు
తెలుగు లోగిళ్లలో నిండిన
కొత్త వెలుగులు!
వేపపువ్వు చేదు.. బెల్లం తీపి..
మామిడి వగరు.. చింతపండు పులుపు..
ఉప్పు రుచి.. పచ్చి మిర్చి కారం..
ఈ షడ్రుచుల సమ్మేళనం
- జీవిత పరమార్థం!
కష్టసుఖాల కలయికే
ఈ మానవ ప్రయాణం
అని చాటి చెప్పేదే మన ఉగాది పర్వదినం.

-జటావత్ రాజు (యువ కవి, రచయిత)
తెలంగాణ విశ్వవిద్యాలయం,




## ఉగాదికి స్వాగతం

మధురమైన మార్పులను
సంతరించుకొని
పరాభవ నామ సంవత్సరం
పతాకం ఎగరేసింది
పరాభవాలు ఎదురైనా
వీడొద్దంది ధైర్యం
వసంతానికి కోకిల గానం,
నెమలి నృత్యంలా
ఉగాదికి తెలుగు గొంతుల
స్వాగత గీతం
పోయినేడాది
పోగొట్టుకున్నదల్లా పెంచాలి
పట్టుదల
పంచిన జ్ఞానమంతా రెట్టింపు
కావాలి మమతల మయంతో
శ్రమ సంగీతం తలెత్తుకొని
బతకాలి
ఉగాది ఏడాదికోసారి
వచ్చేదేనని వదిలేయొద్దు
షడ్రుచుల అనుభవాలను
జీర్ణించుకొని
కొంగొత్త ఆలోచనలకు
రెక్కలు తొడుగాలి
ప్రకృతి పరువాన్ని
కాపాడుకుంటూ సాగాలి
స్వార్థం గొడ్డలి పదును తగ్గి
మొండిదైనా మంచిదే
ప్లాస్టిక్, కాగితం పూల
బతుకులు కాకుండా
వాకిళ్లలో సింగిడిల ముగ్గుల
పూలు పూయించాలి
కొత్త దుస్తుల మెరుపులు
ఆత్మీయతై నిలవాలి ఏడాదల్లా
శుభాకాంక్షల ఆలింగనాలలో
ప్రేమ పండాలి నిలువెల్లా
తరతరమ భేదాల చిన్న
చూపులకు పలకాలి స్వస్తి
పండుగకు పరమాన్నం,
భక్ష్యాలు సరే
ఆకలి కడుపులో ఊరేగింపులు
చవిచూడొద్దు
పంచాంగ గ్రహ స్థితులు
బాగున్న వారంతా చిటికెన
వేలందించి నడిపిస్తే ఇతరులను
సకలం సుభిక్షం దైవాల దర్శనం

కొమురవెల్లి అంజయ్య
సిద్దిపేట
సెల్..9848005676





Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com